ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

మసీదుల సర్వేకు సుప్రీం కోర్టు బ్రేక్ 7

ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేశ్ రికార్డు ఆటలో

మహబూబ్‌నగర్ fb.com/vaartha

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-12-2024 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 315 పేజీలు: 8+4 వెల: 6.50



గురువారం రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

## రైతన్నకు బేడీలా?

### గుండెపోటుకు గురైన రిమాండ్ ఖైదీకి బేడీలు వేయడంపై సర్వత్రా నిరసన

### రైతు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలింపు

**కంది / సంగారెడ్డి టౌన్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా కేంద్ర కారాగారంలోని రిమాండ్ ఖైది ఈర్యా నాయక్‌కు గుండెపోటు రావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో రైతుపట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో రైతుకు బేడీలు వేసిన ఘటనపై >>2

**సిఎం సీరియస్ విచారణకు ఆదేశం**

**జైలు అధికారి సస్పెన్షన్** 2



## 'జమిలి'కి కేబినెట్ ఓకే

### ఈ సమావేశాల్లోనే పార్లమెంటులోకి..

### రామ్‌నాథ్ కోవింద్ నివేదికను గత సెప్టెంబరులోనే ఆమోదించిన మంత్రివర్గం

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న వన్‌నేషన్ వన్ ఎలక్షన్ ముసాయిదా బిల్లుకు కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈ బిల్లు దోహదంచేస్తుంది. ఆ తర్వాత మలిదశలో మున్సిపల్ ఎన్నికలుంటాయి. ఈ బిల్లు అమలుకోసం రాజ్యాంగంలోని కనీసం ఐదు అధికరణాలకు సవరణలు తీసుకురావాల్సి వచ్చింది. వీటన్నింటినీ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. ప్రధాని >>2



లొంగిపోయిన మావోయిస్టులు

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ఇద్దరు మహిళలు సహా 10 మంది మావోయిస్టులు మృతి

**చర్ల, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్, దంతెవాడజిల్లాలో సరిహద్దులో గల సౌత్‌అబూజ్ మడ్ అటవీ ప్రాంతంలో గురువారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు పది మంది మావోయిస్టులు మృతిచెందినట్లు బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం అయారన్న పక్కా సమాచారంతో నారాయణపూర్, దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాల డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ ఉమ్మడి బలగాలు సెర్చ్ >>2

# ప్రాజెక్టులకు నిధులివ్వండి

### రూ.1.63 లక్షల కోట్ల మేర చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరిన ముఖ్యమంత్రి రేవంత్

### ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ 2, మూసీ రివర్ ఫ్రంట్‌లకు నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సిఎం వినతి

### సింగరేణికి కోల్‌బ్లాక్‌లు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన సిఎం

### కేంద్ర మంత్రి గడ్కరీకి కూడా వివిధ ప్రాజెక్టులపై వినతులు ఇచ్చిన ముఖ్యమంత్రి



గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన సిఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి తదితరులు -7లో

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు12:** తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 తోపాటు హైదరాబాద్, వరంగల్‌ల్లో సీవరేజీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్ సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా మొత్త రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని.. త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌ఏఐ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి ఇంకా అనుమతి ఇవ్వని విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆర్ఆర్ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు >>2



## న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

### పార్టీలో డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

### ఈవెంట్స్‌లో సిసి కెమెరాలు తప్పనిసరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు12:** హైదరాబాద్‌లో న్యూఇయర్ వేడుకలకు పలు ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకలు 31వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట వరకు ముగించాలని, స్పెషల్ ఈవెంట్స్ కండక్ట్ చేసే నిర్వాహకులు 15 రోజుల ముందే పోలీస్ పర్మిషన్ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఈవెంట్ ఎంట్రీ అండ్ ఎగ్జిట్ దగ్గర సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వాడితే కఠిన >>2



### ఆరోజు ఏం జరిగిందంటే..

# నేను కొట్టడం తప్పే

### కానీ అదెలా జరిగిందో మీరే ఆలోచించండి

### ఆడియో సందేశంలో మోహన్‌బాబు రియాక్షన్



**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు, మంచు మోహన్ బాబు కుటుంబ వివాదం నేపథ్యంలో ఆయన ఇంటివద్దకు వెళ్లిన జర్నలిస్టుపై ఆయన దాడి చేశారం టూ పెద్దఎత్తున చర్చ జరగుతున్న వేళ.. ఈ ఘటనపై తొలిసారి మోహన్ బాబు స్పందించారు. గురువారం ఆడియో సందేశాన్ని మోహన్ బాబు విడుదల చేశారు. ఆరోజు అసలు ఏం జరిగిందనే విషయాన్ని ఆయన వివరించారు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో మోహన్ బాబు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలో పరిస్థితి కొంచెం కుదుటుపడటంతో ఆయన ఆడియో సందేశాన్ని రిలీజ్ చేశారు.

జర్నలిస్ట్‌పై దాడి చేశారని జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందింస్తూ జర్నలిస్టులను కొట్టాలని తాను దైవసాక్షిగా అనుకోలేదన్నారు. మొదట తాను జర్నలిస్టుకు నమస్కారం పెట్టానని, అయినా అతను తన వద్ద మైక్ పెట్టారని తెలిపారు. ఆ మైక్ తన కన్నుకు తగలబోయిందని, తృటిలో తాను తప్పించుకున్నట్లు చెప్పారు. విజయవాడలో తాను ఒకప్పుడు ఉద్యోగినేనని గుర్తు చేశారు. తన ఇంటికి వచ్చినవారు మీడియా వారా వేరే వారు ఎవరైనా వచ్చారా అనే విషయం తనకు తెలియదన్నారు. జరిగిన సంఘటనకు తాను మనస్ఫూర్తిగా చింతిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనకు బాధపడుతున్నానని, ఆ జర్నలిస్టు తనకు తమ్ముడులాంటి వారన్నారు. అన్ని విషయాలను పైన భగవంతుడు చూస్తున్నారని మోహన్ బాబు తెలిపారు.తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, తాను చేసిన మంచి పనులను ఎవరూ అర్థం చేసుకోవడంలేదన్నారు. జర్నలిస్టులను కొట్టడం మాత్రం తప్పే అయినప్పటికీ..సందర్భాన్ని అర్థం చేసుకోవాలని మోహన్‌బాబు తన ఆడియో సందేశంలో పేర్కొన్నారు. తాను ఉద్దేశపూర్వకంగా కొట్టలేదన్నారు. మైకులు లాక్కుని కొట్టేంత మూర్ఖుడిని తాను కాదన్నారు. పోలీసులంటే తనకు ఎంతో ఇష్టమని, వారు శాంతి భద్రతలను కాపాడాలన్నారు. కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మోహన్‌బాబు తెలిపారు. ఇది న్యాయమా.. అన్యాయమా అనేది ఆలోచించాలన్నారు.

**అసలు ఏం జరిగిందంటే..**

తనపై తండ్రి మోహన్ బాబు, అతడి అనుచరులు దాడి చేశారని మంచు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మొదలైంది. ఆ తర్వాత మంచు మోహన్‌బాబు తన కుమారుడు తనపై దాడికి పాల్పడ్డారంటూ మనోజ్, మౌనికపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదం రచ్చకెక్కడంతో మీడియా ఈ అంశంపై ఫోకస్ చేసింది. మోహన్‌బాబు ఇంటి వద్ద న్యూస్ కవరేజ్ చేస్తున్న ఓ జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన సంచలనం రేపడంతో అసలు ఏం జరిగిందనే దానిపై మోహన్ బాబు క్లారిటీ ఇచ్చారు. తన ఆడియో సందేశంలో పూర్తి వివరాలను మోహన్ బాబు వివరించారు.

## ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఫేషియల్ రికగ్నిషన్ హాజరు

### పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం

### ఆదేశాలు జారీ చేసిన పాఠశాల విద్య

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఫేసియల్ రికగ్నేషన్ అటెండెన్స్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించాలని భావించినప్పటికి మొదటగా పైలట్ ప్రాజెక్టుగా పెద్దపల్లి జిల్లాలో ప్రారంభించాలని పాఠశాల విద్య డైరక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా డీఈవో దీని అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, టీఎస్ మోడల్ స్కూల్స్, కేజీబీవీ, యూఆర్ఎస్, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నింటిలోనూ ఫేషియల్ రికగ్నేషన్ హాజరును అమలు చేయాలని సూచించారు. ఫేషియల్ రికగ్నేషన్ హాజరు కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించి మానిటరింగ్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## తెలంగాణ సంస్కృతిపై దాడి

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణలో సంస్కృతిపై దాడి జరుగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ మాయమైందని, బతుకమ్మ మన పండుగే కాదన్న ప్రచారం మొదలైందని, తెలంగాణ వేడుకలో జానపదం కనుమరుగైతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బాసరలో లడ్డూలు అందకుండా పోతున్నయని, కొమురవెల్లి ప్రసాదంలో నాణ్యత లేకుండా పోతుందని, వేములవాడలో మొక్కులు చెల్లించే కోడెలు మాయమై తున్నాయని, పండుగల మీద ఆంక్షలు పెరుగుతున్నయని, ఎక్కడపడితే అక్కడ ఆలయాలపై దాడులు జరుగుతున్నయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంస్కృతిపై జరుగుతున్న దాడులను, ఆయా ఘటనలను చూసీ చూడనట్టు వదిలేస్తోందా? లేక, ప్రభుత్వమే ఈ సాంస్కృతిక దాడిని చేయిస్తోందా? అంటూ సంజయ్ ప్రశ్నించారు.




## బతుకమ్మను మెజారిటీ ప్రజలు ఆడరు

### మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఆలిని మార్చే సంస్కృతి కెటిఆర్‌ది కావొచ్చు తెలంగాణది కాదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బతుకమ్మ పండుగ దళిత,గిరిజన,వెనుకబడిన ఇండ్లలో ఆడేవారు కాదని ఆయన తెలిపారు. కెసిఆర్ కుటుంబం మునిగే పడవను ఆపడానికి ఏదైనా చేస్తారని ఆయన అన్నారు. సోషల్‌మీడియా మీద ఆధారపడితే పతనం ఖాయమని ఆయన బిఆర్ఎస్‌ను హెచ్చరించారు. బతుకమ్మలో ఫ్యూడల్ ఇజం ముడిపడి ఉంది పింక్ కలర్ నిజాం పాలనకు సింబల్ అని అన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయంలో ఉంది కానీ బతుకమ్మను మెజార్టీ ప్రజలు ఆడరని ఆయన సూత్రీకరించారు. కెసిఆర్ ఉనికి తెంగాణ రాష్ట్రంలో లేనే లేదు అని ఆయన అన్నారు. కెసిఆర్ అసెంబ్లీకి రాకపోతే పదవి ఎందుకు పికానిక అని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ అని పార్టీపేరు మార్చుకొని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా పెట్టలేదని ఆయన అన్నారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ ముస్లింలుల, క్రిస్టియన్లు బౌద్దులు, గిరిజనలు ఎప్పుడు బతుకమ్మ ఆడలేదు అని ఆయన అన్నారు. మా ఇంట్లో ఎప్పుడు బతుకమ్మ ఆడలేదు అని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ తల్లి, రాష్ట్రీయ గీతం అధికారికంగా ప్రకటించుకొన్నామని ఆయన తెలిపారు.

# మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్ అరెస్టు

### తాండూరు గిరిజన వసతిగృహ విదార్థులను పరామర్శించేందుకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

### అక్కడికి అనుమతి లేదని పోలీసుల నిరాకరణ



చెన్నారెడ్డి చౌరస్తాలో రోడ్డు బైఠాయించిన మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్, బిఆర్ఎస్ నాయకులు

**వికారాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** మాజీ మంత్రులు పి.సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ప్రజా పాలన అంటూ.. ప్రజలను కలిసేందుకు వెళ్తే ఎందుకు అడ్డుకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా తాండూరు లోని సాయిపూర్ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించేందుకు సిద్దులూర్-వికారాబాద్ మీదుగా తాండూర్ వెళ్తున్న మాజీ మంత్రులు పి.సబిత ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌లను వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మర్రి చెన్నారెడ్డి చౌరస్తాలో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. హాస్టల్ వద్దకు వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు నిరాకరించారు. దీంతో ప్రభుత్వం, పోలీసుల తీరుకు నిరసనగా స్థానిక బిఆర్ ఎస్ నాయకులు, కార్య కర్తలతో కలిసి వారు మర్రి చెన్నారెడ్డి చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన దిగారు. ఈ సందర్భంగా పి.సబిత ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తాండూరు గిరిజన వసతి గృహ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకుని పరామర్శించేందుకు వెళ్తేంటే పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను పరామర్శిస్తే సర్కారు బండారం బయటపడు తుందనే తమను అడ్డుకున్నారని ఆరోపించారు. మాజీమంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ అస్వస్థతకు గురైన విద్యార్థులు తమ పిల్లలుగా భావించి పరా మర్శిం చేందుకు తాండూరుకు వెళ్తుంటే పోలీసులు అడ్డు కోవడం సరైందికాదని అన్నారు. ఫుడ్ ఫాయిజన్ కు.. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సంబంధం ఏమిటని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు అధికార పార్టీ నాయకులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

## మంత్రి కొండా సురేఖపై నాగార్జున కేసు విచారణ వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున వేసిన పరువు నష్టం కేసు విచారణను నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. నేడు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. పలు కార్యక్రమాల కారణంగా విచారణకు హాజరు కాలేక పోతున్నట్లు సదరు మంత్రి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసింది.

## టిజిఆర్టీసీలో సర్వీస్ రిమూవల్ కేసులపై త్రిసభ్య కమిటీ : మంత్రి పొన్నం

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** టిజిఆర్టీసీ ఉద్యోగులలో సర్వీస్ నిమిత్తం వివిధ కేసుల సత్వర పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం లేబర్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ చైర్మన్‌గా ఆర్టీసీ ఎండి సజ్జనార్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య సభ్యులుగా ఈ కమిటీ పనిచేయనుంది. ఆర్టీసీలో ఉద్యోగుల్లో గతంలో సర్వీస్ రిమూవల్ కేసులు నమోదైన వాటిపై ఈ కమిటీ పరిశీలించనుంది. ఇప్పటికే ప్రజావాణిలో ఆర్టీసీకి సంబంధించిన సర్వీస్ రిమూవల్ కేసుల విషయమై ఫిర్యాదులను ఈ త్రిసభ్య కమిటీ సమీక్షిస్తుంది. త్రిసభ్య కమిటీ కేసు మెరిట్స్ మేరకు ఆర్టీసీ యాజమాన్యానికి సిఫారసు చేయనుంది.




వార్త

వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.

-వివేకానందుడు

# పటిష్టమైన చట్టమే పరిష్కారం

బాధపడడం తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవలకాలంలో సహనం, ఓర్పు, సన్నగిల్లి ఆందోళనబాటపడుతున్నారు. తమకు ఎంతటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లి కుళ్లి మనసులో బాధపడి చివరకు ప్రాణత్యాగం చేయడానికి అయినా సిద్ధపడతారే తప్ప తమను దగా చేసినవారిపై కక్షకట్టి దాడులు చేసేందుకు సాహసించకపోయేవారు. పంటకు గిట్టుబాటు ధర రాకపోయినా దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని మోసానికి గురవుతున్నా తమకు కర్మకు తామే బాధపడుతూ మౌనరోదనతో ఇంటిముఖం పట్టేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్లపైకి రావడం, ధర్నాలు, నిరసనలు లాంటి కార్యక్రమాలు తెలిపేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే నాయకులను నిలదీస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గపరిణామమే. కానీ దౌర్జన్యాలకు హింసకు దారితీయకూడదు. దేశవ్యాప్తంగా చూసినా అధిక శాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం. కొలతల్లో మోసం, ధరలను నిర్ణయించడంలో దగా. ఒకటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉంటున్నారు. రైతులు మోసపోతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంత కాలం మోసం చేసేవారు ఉంటారన్నట్లే ఈ దళారీ వ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు బాధలు తప్పవు. దళారీ వ్యవస్థను రూపుమాపుతామని రైతులకు, వినియోగదారులకు మధ్యదళారులు ఉండకూడదని పాలకులు ఎంతగా చెప్తున్నా, ఎన్నిహామీలు ఇస్తున్నా ఆచరణకు వచ్చేసరికి అవన్నీ ఉత్తరకుమారుల ప్రగల్భాలుగానే మిగిలిపోతున్నాయి. అంతెందుకు కూరగాయల రైతులకు న్యాయం చేస్తామని నేరుగా వినియోగదారులకే రైతులు అమ్ముకునే విధంగా ఏనాడో రైతుబజార్ల వ్యవస్థను పాలకులు ప్రవేశపెట్టారు. కొంతకాలం రైతులకు ఉపయోగకరంగా ఉన్నా రాజకీయాలు చోటుచేసుకొని క్రమేణ ఆరైతుబజార్లు దళారులపాలయ్యాయి. విత్తేదగ్గర నుంచి విక్రయించే వరకు అన్నిస్థాయిల్లోనూ రైతులు దగాకు గురవుతున్నారు. దీనిని నిరోధించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ఆశించిన ఫలితాలు కన్పించడంలేదు. ఇప్పుడు తెలంగాణలో రబీ సీజన్ ఆరంభం కాబోతున్నది. పంటలకు మూలం విత్తనాలు. ఆ విత్తనాలే నాసిరకమో, నకిలీవోఅయితే రైతుల పరిస్థితిదారుణంగా ఉంటుంది. ప్రతియేటా ఎందరో రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. మరొకపక్క నకిలీ నాసిరకం విత్తనాలు సరఫరా చేసేవారిపై పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వదిలిపట్టే ప్రసక్తి లేదని పీడీచట్టాన్ని ప్రయోగించి కటకటాల వెనక్కి పంపేందుకు వెనుకాడమని పాలకులు హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నా ఈనకిలీ విత్తన వ్యాపారులు అవేమీ పట్టించుకునే పరిస్థితిలో లేరు. యేడాది యేడాదికి నకిలీ విత్తనాల వ్యాపారం దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని నకిలీవిత్తనాలు భారీఎత్తున సరఫరా చేస్తున్నారు. ప్రతియేడాది సీజన్ ఆరంభంలో అధికారులు చేస్తున్న దాడుల్లో దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల విలువైన నకిలీ, నాసిరకం విత్తనాలు పట్టుబడుతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో కూడా తక్కువేమీ కాదు. అలాగని ప్రభుత్వం ఏమీ చర్యలు తీసుకోవడం లేదని చెప్పడం లేదు. ప్రతియేడాది వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన నకిలీవిత్తనానలు పట్టుకుంటున్నారు. కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు. కేసులు నమోదు చేసి, దర్యాప్తులు కూడా చేస్తున్నారు. కానీ ఆశించిన ఫలితాలు ఉండడంలేదు. పట్టుబడిన వారు చట్టంలోని లొసుగులనో, కొందరు అధికారుల చేతివాటం ద్వారా కేసులనుంచి సులభంగా బయటపడ గలుగుతున్నారు. కూరగాయలకు సంబంధించి నకిలీవ్యాపారానికి అదుపులేకుండా పోతున్నది. రసీదులు, బిల్లులు లాంటివి ఏ ఆధారాలు లేకుండా కోట్లాది రూపాయల విలువైన కూరగాయల విత్తనాలు, ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకొని విక్రయిస్తున్నారు. వీటికి రైతులు అడిగినా ఎలాంటి రసీదులు ఇవ్వకుండా, ఆధారాల్లేకుండా చూసుకుంటున్నారు. ఈ వ్యాపారం తెలుగు రాష్ట్రాల్లో పెద్దఎత్తున బాహాటంగా జరుగుతున్నది. అధికారులకు స్పష్టంగా తెలిసినా మౌనంగానే ఉంటున్నారు. వారి కారణాలు వారికి ఉన్నాయి. తెలంగాణలో రబీ సీజన్‌కు సంబంధించి సాగుప్రారంభమై దాదాపుసగానికి పైగా పూర్తయింది. విత్తనాల కొరత స్పష్టంగా కనపడుతున్నది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఈ నకిలీ వ్యాపారులపై రైతులకు ఆధారపడని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ వ్యాపా రాన్ని అడ్డుకునేందుకు మూడు దశాబ్దాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం సఫలీకృతం కావడంలేదు. ఇందుకు ప్రధానకారణం కొందరు అధికారుల అవినీతితో పాటు చట్టంలోఉన్న లొసుగులే. విత్తనచట్టం రైతులకంటే దళారులకే ప్రయోజనకరంగా ఉందని, దాన్ని మార్చి ఆ స్థానంలో పటిష్టమైన కొత్త విత్తన చట్టంతేవాలని ఏనాటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడంలేదు. విదేశాల్లో నకిలీ, నాసిరకం విత్తనాలతో మోసం చేసినదళారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి చర్యల కారణంగా చైనాలాంటి దేశాల్లో అసలు నకిలీ విత్తనాలకు చోటు లేకుండా చేశారు. దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లో విత్తనాల్లో మోసపోయిన వారి సంఖ్య తక్కువేమీ కాదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. వారికున్న ఒక్క ఉపాధిని వారి పాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన అవసరం ఉంది.

మాట ఇవ్వటానికి తొందరపడొద్దు, ఇచ్చిన మాట నెరవేర్చడానికి వెనుకాడవద్దు.



లియో టాల్‌స్టాయ్

మిడిమిడి జ్ఞానం ఉన్నవారు ప్రతి విషయాన్ని వివరిస్తారు. వాళ్లు దేన్ని చూసీ ఆశ్చర్యపోరు.



సెయింట్ బెర్నార్డ్

# ప్రజావాక్కు



### సినీ నిర్మాతకో న్యాయం, రైతన్నకో న్యాయమా?

సినీ నిర్మాత నేను 500కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి సినిమా తీసాను. టికెట్స్ ధర పెంచుకుంటే నష్టపోతాను అని చెప్పగానే టికెట్స్ ధరలు పెంచుకునే విధంగా వెంటనే అనుమతి ఇస్తున్న ఈప్రభుత్వాలు సంవత్సరమంతా కష్టపడే ఒక రైతన్న ఎకరాకు యాభైవేల రూపాయలు నుండి లక్ష రూపాయలు వరకూ పెట్టుబడి పెట్టి తీరా పంట చేతికొచ్చే టైంకు ప్రకృతివైపరీత్యాలకు అంటే వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టం వచ్చేలా ఉంది. క్వింటాలుకు కనీసం 100రూపాయలైనా పెంచమంటే ఈ ప్రభుత్వాలు ఎందుకుపెంచరు? సంవత్సరమంతా కష్టపడే కర్షక రైతుగురించి ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. నిర్మాత కోన్యాయం, రైతన్న కో న్యాయమా? ఇప్పటికైనా ప్రభుత్వాలు ఈవిషయం గురించి ఆలోచించి రైతన్నలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

-దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం, ప.గోదావరి జిల్లా

### దుమ్ము కొట్టుకుంటున్న అర్జీలు!

రాష్ట్రపాలక కూటమి నేతలు ప్రజా వేదిక, ప్రజా దర్బార్, ప్రజావాణి అంటూ తమసమస్యల పరిష్కారంకోసం ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. ఆ పైన హల్లో లోకేష్ అని ఒక ఈ మెయిల్ ఐడి ఇచ్చి విన్నపాలు పంపమన్నారు. ఇలాంటి విన్నపాలు వేలసంఖ్యను దాటి లక్షలకు చేరుకుంటున్నాయి. అయినా పరిష్కారంఅయిన విన్నపాలు మాత్రం బహు స్వల్పం. మరి రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న ప్రజా విజ్ఞప్తులకు మోక్షం ఎప్పుడు? ఈ సమస్యలు పరిష్కరించడానికి స్థానిక అధికార యంత్రాంగం, పాలక పార్టీల నేతలు చేష్టలుడిగి, గోళ్ల గిల్లుకుంటున్నారా?

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

### ప్లాస్టిక్ బ్యాగులు వద్దు

పర్యావరణ పరిరక్షణ కొరకుప్లాస్టిక్ బ్యాగులు వద్దు బట్టల బ్యాగులు ముద్దు అని అంటే బాగుంటుంది. కానీ ఏ రాజకీయ నాయకులూకూడా ప్లాస్టిక్ బ్యాగులను అరికడదామని చట్టం తీసుకరావాలి. ప్లాస్టిక్ బ్యాగులు అమ్మే దుకాణాల పైన వాడే వారి పైన మాత్రమే జులుం ప్రతాపం చూపిస్తున్నారు. ఒకవేళ రాజకీయ లంచగొండి తనం లేకపోతే ఈ రోజు నా దేశం అమెరికాను మించి ఉండేది ఎప్పుడో అభివృద్ధిలో అమెరికాను దాటిపోయేది.

-సింగు లక్ష్మీనారాయణచింతకుంట, కొత్తపల్లి, కరీంనగర్

### ప్రశ్నపత్రాలు నేరుగా పాఠశాలలకు చేర్చాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో తేది 11.12.2024 నుండి ఒకటవ సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. అయితే ఈ పరీక్షల ప్రశ్నాపత్రాలను ఏ రోజుకు ఆ రోజు ప్రధానోపాధ్యాయులు మండల రిసోర్స్ సెంటరుకి వచ్చి తీసుకువెళ్లాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఏకోపాధ్యాయపాఠశాలలుఅధికంగా ఉన్నవి. అంతేగాక ఉపాధ్యాయులుఎఫ్.ఎల్.ఎన్ శిక్షణా కార్యక్రమాలలో ఉన్నందున స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉంది. రోజూ ప్రశ్నాపత్రాలు తీసుకోవడానికి మండల్ రిసోర్స్ సెంటర్లకు, స్కూల్ కాంప్లెక్స్‌లకు పోయి రావటం ప్రధానోపాధ్యాయులకు ముఖ్యంగా సింగిల్‌టీచర్లకువీలుపడదు. కాబట్టి ఉపాధ్యాయుల విజ్ఞప్తి పరిశీలించి పరీక్షల ప్రశ్నాపత్రాలను స్కూల్ కాంప్లెక్స్ స్థాయికి చేర్చి అక్కడనుండి పాఠశాలలకు నేరుగా పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### అతి వద్దు

ఇటీవల కాలంలో సినీమా వాళ్ల విషయంలో అటు ప్రజలు ఇటు మీడియా అతి చేస్తున్నారు. చిన్న విషయాలను కూడా పెద్దగా చేసి పదే పదే టీవీలో వైరల్‌గా చూపుతున్నారు. వాళ్ల వ్యక్తిగత జీవితాల్లో ఏచిన్నసంఘటన జరిగినాదాన్ని బహిర్గతం చేస్తున్నారు. లేనిపోని గాసిప్స్ సృష్టిస్తున్నారు. ఇక సోషల్ మీడియా మరింత దిగజారుడుగా మారింది. ఉన్నవి లేనట్లు లేనివి ఉన్నట్లు చూపించడం దాని ప్రత్యేకత. మోహన్ బాబు మంచు విష్ణుల మధ్య జరుగుతున్న వివాదాన్ని ఎందుకు అంత రచ్చ చేస్తున్నదిమీడియా. అదివారి కుటుంబ సభ్యులకు మధ్య జరిగేసమస్య. దానికి అంత ప్రాముఖ్యం రాద్ధాంతం ఎందుకు? దానివల్ల ప్రజలకు ఏమైనా ఉపయోగమా? అని ఆలోచించాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

### అసలు సమస్య రెవెన్యూ రికార్డులతోనే!

రాష్ట్ర రెవెన్యూ మంత్రిగారు రెవెన్యూ శాఖలో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులన్నిటినీపరిష్కరిస్తామని చెబుతున్నారు. అసలు సమస్య రెవెన్యూరికార్డుల్లో మార్పులు, చేర్పులు ఎప్పటికప్పుడు నమోదు కావడం, ఆ మార్పులను ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరగాలి, కానీ అవేమీ, ఎక్కడా జరగడం లేదు? రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పాలకులకు సరైన అవగాహన లేకపోవడంతో రెవెన్యూసిబ్బంది ఆడిందిఆట, పాడింది పాటగా తయారయింది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎలక్ట్రానిక్ చిప్స్‌కొరతను అధిగమించేదెలా?

**ఎలక్ట్రానిక్స్ ఐటి మంత్రిత్వ శాఖ ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్‌ఎం) లో 1000 కోట్ల డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. దేశంలో సెమీకండక్టర్ పరిశోధన అభివృద్ధికి మద్దతు ఇవ్వాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రదర్శిస్తుంది. 2014లో ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా చొరవ దేశంలో తయారీని ప్రోత్సహించడం, దేశాన్ని ప్రపంచ తయారీ హబ్‌గా స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది. సెమీకండక్టర్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్‌ఐ) పథకంతోసహా అనేక కార్యక్రమాలు ప్రారంభించారు. మెమరీ చిప్‌లలో గ్లోబల్ లీడర్ అయిన "మైక్రోన్ టెక్నాలజీ" సంస్థ భారీ నిర్దిష్ట ప్రణాళికతో గుజరాత్‌లో కొత్త సెమీకండక్టర్ అసెంబ్లీ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఇది దేశ సెమీకండక్టర్ స్థితిగతులను గణనీయంగా పునర్నిర్మిస్తుందని భావిస్తున్నారు.**

**డి జయరాం**

ఈ రోజు దాదాపు ప్రతి డిజిటల్ ఎలక్ట్రానిక్ పరికరం సెమీకండక్టర్లతో నడుస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు (ఐసి) తయారీకి ఇవి కీలకం. వీటిని మైక్రోచిప్స్ అని కూడా పిలుస్తారు. ఈ చిన్న భాగాలు మన రోజువారీ జీవితాలను సుఖమయం చేస్తున్నాయి. ఫోన్‌లు, కంప్యూటర్లు, కార్లు వంటి పరికరాలను పని చేయడానికి ఇవి వీలు కల్పిస్తాయి. ఒక్క స్మార్ట్‌ఫోన్‌లో 100కి పైగా సెమీకండక్టర్ చిప్‌లు ఉంటాయి. స్మార్ట్‌ఫోన్‌లలో సెల్యులార్ నెట్వర్కు కనెక్ట్ చేయడానికి, టచ్‌స్క్రీన్, డేటాను నిల్వకోసం, కంప్యూటర్లలో సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి, రిఫ్రిజిరేటర్లు, డిష్వాషర్లు, వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్లు వంటి ఉపకరణాలలో విద్యుత్ ప్రవాహాన్ని నియంత్రించడానికి, మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సెమీకండక్టర్ల చిప్స్ అవసరం. ఇంకా కృత్రిమమేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ)లో కంప్యూటింగ్ శక్తికి డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి, ఏఐ, జిపియులకు ప్రత్యేక రకం చిప్ అవసరం. కృత్రిమ మేధ అనువర్తనాలు, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్లో ఉపయోగించే చిప్లకు డిమాండు ఉంది. వాహన తయారీదారులకు అధిక కంప్యూటింగ్ శక్తితో చిప్లు ఎక్కువగా అవసరం. ముఖ్యంగాపరిశ్రమ ఎలక్ట్రిక్ నుండి స్వయంప్రతిపత్తి వాహనాలకు మారుతున్నప్పుడు స్మార్ట్ఫోన్లలో ఉపయోగించే వాటి కంటే భిన్నమైన చిప్స్ అవసరం అవుతాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జీ, 6జీలు భవిష్యత్తులో చిప్ డిమాండ్‌ను పెంచుతాయి. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లకు ఎక్కువ డిమాండ్ ఫలితంగా చిప్ కొరత ఏర్పడింది. ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ 2019 తో పోలిస్తే 2020లో 6.8 శాతం పెరిగింది. ఫార్చ్యూన్ బిజినెస్ ఇన్సైట్స్ ప్రకారం ఇది 2022 లో 573.44 బిలియన్ డాలర్ల నుండి 2029 నాటికి 1,380.79 బిలియన్ డాలర్లకు 12.2 సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో పెరుగుతుందని అంచనా వేసింది. ప్రపంచంలో ఇప్పుడు రష్యా, ఉక్రెయిన్ మధ్య, ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, అనేక దేశాలలో సంభవిస్తున్న సంక్షోభాలు ప్రపంచ చిప్ సరఫరా గొలుసును ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఇక యుయస్‌లో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక చైనా చిప్స్ అమ్మకాలపై నియంత్రణలను ప్రేరేపించవచ్చు. ఈ విషయాన్ని యుఎస్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ నివేదికలో ప్రపంచంలోనే అతిపెద్ద సెమీకండక్టర్ మార్కెట్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ) తెలిపింది. ఈ కారణంగా మరో చిప్ కొరత ఏర్పడుతుందని కొన్ని అంచనాలు ఉన్నాయి. డిమాండ్, సరఫరా మధ్య అంతరాన్ని చిప్ తయారీదారులు కూడా అంత త్వరగా పూడ్చలేరు. ఇంక ఇక్కడ మరో సమస్య ఉంది. కొత్త సెమీకండక్టర్ ఫ్యాబ్‌లను తెరవడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ నైపుణ్యం కలిగిన ఇంజనీర్ల కొరత మరోపక్క ఉంది. ఎస్ఐఏ నుండి వచ్చిన కొత్త డేటా ప్రకారం 2030 నాటికి ఈ పరిశ్రమలు 1,15,000 కంటే ఎక్కువ ఉద్యోగాల కల్పనకు కారణమవుతాయని అంచనా వేయబడింది. మన దేశంలో దేశంలో జనాభా, ప్రజల ఆదాయం, సాంకేతిక పరిజ్ఞానాల పెరుగుదల కారణంగా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అతిపెద్ద వాటాను కలిగి ఉంది. స్మార్ట్ ఫోన్లు, టేబ్లు, ల్యాప్టాప్లు,



ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు డిమాండ్ పెరగడంతో సెమీకండక్టర్ వినియోగం పెరుగుతోంది. నిరంతరం విస్తరిస్తున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, అధునాతన గాడ్జెట్ల పట్ల పెరుగుతున్న అభిరుచి, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌ను ప్రాథమిక చోదక శక్తిగా నిలబెట్టాయి. ఇది దేశంలో సెమీకండక్టర్ మార్కెట్ పెరుగుదల గతిని ప్రభావితం చేసే కీలకరంగంగా మారింది. ప్రస్తుతం భారత్ ప్రధానంగా తైవాన్, చైనా, కొరియా, వియత్నాం దేశాల నుంచి సెమీకండక్టర్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. దేశంలోసెమీ కండక్టర్ మార్కెట్ విలువ 2023లో 3430కోట్ల డాలర్లు. 2023 నుండి 2032 కాలంలో కాలంలో 20.1సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్)తో 10,020కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశం సెమీకండక్టర్ పరిశ్రమలో గణనీయమైన పురోగతిని సాధించింది. సెమీకండక్టర్ డిజైన్ ఇంజనీర్ల అత్యంత నైపుణ్యం కలిగియున్న ప్రముఖ దేశాలలో ఒకటిగామారింది. ప్రపంచంలోని సెమీకండక్టర్ డిజైన్ ఉద్యోగులలో 20శాతం మనవారే ఉన్నారు. లక్ష మందికి పైగా వీఎల్ఎస్ఐ డిజైన్ ఇంజనీర్లు ప్రపంచ సెమీకండక్టర్ కంపెనీలు, దేశీయ డిజైన్ సేవా సంస్థలలో పనిచేస్తున్నారు. అధునాతన ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీస్ (ఫ్యాబ్స్) స్థాపన నిర్వహణకు సంబంధించిన అధిక ముందస్తు ఖర్చుల మూలధన వ్యయం కారణంగా సెమీకండక్టర్ పరిశ్రమ గణనీయమైన నియంత్రణను ఎదుర్కొంటుంది. భారీ ప్రారంభ పెట్టుబడుల అవసరం చిన్న సంస్థలకు బలమైన అవరోధాన్ని సృష్టిస్తుంది. అదనంగా ఎగుమతి నియంత్రణలు, వాణిజ్య సుంకాలు, పర్యావరణ నిబంధనలు వంటి నిబంధనలలో మార్పులు సెమీకండక్టర్ మార్కెట్ను ప్రభావితం చేస్తాయి. కఠినమైన నియంత్రణ అవసరాలు భారత సెమీకండక్టర్ మార్కెట్‌కు అవరోధంగా ఉన్నాయి. ఎందుకంటే అవి కొత్త ఉత్పత్తులు సాంకేతికతల అభివృద్ధి ప్రవేశాన్ని నిరోధిస్తున్నాయి. కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు, ఇతర పర్యావరణ ప్రమాణాలకు సంబంధించిన కఠినమైన నిబంధనలు, మేధో సంపత్తి, పేటెంట్లపై న్యాయ పోరాటాలు మార్కెట్ పురోగతిని ప్రభావితం చేస్తాయి. వివాదాలు సంబంధిత కంపెనీలకు చట్టపరమైన ఆర్థిక ఇబ్బందులకు గురిచేయవచ్చు. పోటీతత్వంతో ఉండటానికి ఉత్పత్తి క్షీణతను నివారించడానికి కంపెనీలు పరిశోధన అభివృద్ధిలో నిరంతరం పెట్టుబడి పెట్టాలి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, శక్తి వినియోగానికి సంబంధించిన సమస్యలతో సహా కంపెనీలు తమ ఉత్పత్తులను ఈ అవసరాలకు అనుగుణంగా మార్చాల్సి ఉంటుంది. సెమీకండక్టర్ తయారీ, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్పష్టమైన సహాయక నిబంధనలు, విధానాలు అవసరం. అనుమతుల ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, ప్రోత్సాహకాలను అందించడం పరిశ్రమ వృద్ధికి దోహదపడుతుంది. ఎలక్ట్రానిక్స్ ఐటి మంత్రిత్వ శాఖ ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్‌ఎం) లో 1000 కోట్ల డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. దేశంలో సెమీకండక్టర్ పరిశోధన అభివృద్ధికి మద్దతు ఇవ్వాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రదర్శిస్తుంది. 2014లో ప్రారంభించిన ఖిమేక్ ఇన్ ఇండియాఖి చొరవ దేశంలో తయారీని ప్రోత్సహించడం, దేశాన్ని ప్రపంచ తయారీ హబ్‌గా స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది. సెమీకండక్టర్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్‌ఐ) పథకంతోసహా అనేక కార్యక్రమాలు ప్రారంభించారు. మెమరీ చిప్‌లలో గ్లోబల్ లీడర్ అయిన "మైక్రోన్ టెక్నాలజీ" సంస్థ భారీ నిర్దిష్ట ప్రణాళికతో గుజరాత్‌లో కొత్త సెమీకండక్టర్ అసెంబ్లీ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఇది దేశ సెమీకండక్టర్ స్థితిగతులను గణనీయంగా పునర్నిర్మిస్తుందని భావిస్తున్నారు. ●

# జన్మించిన ప్రదేశాన్ని బట్టే పౌరసత్వం

**కనుమ ఎల్లారెడ్డి**

జనవరి ఇరవై, 2025న అమెరికా నూతన అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపడుతున్నారు. అమెరికా చరిత్రలో ఓ నూతన అధ్యాయం ప్రారంభిస్తామని ఆయన ఆలోచనగా ఉంది. ట్రంప్ ముందు చేయాల్సిన పని విశ్వశాంతికి శ్రీకారం చుట్టాలి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగిస్తానని చెప్పడం, పశ్చిమ ఆసియాలో శాంతి నెలకొల్పడం చేయాలి. అమెరికా ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయాలి. ప్రపంచలో నెంబర్ వన్ కంట్రీగా అమెరికాను నిలబెట్టాలి. ఇవన్నీ ట్రంప్‌కే సాధ్యం. అయితే దేశాల మధ్య మైత్రి, సహకారం సాగాలి. అమెరికాలో ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల పట్ల సానుకూల ప్రదర్శన కొనసాగించాలి. చదువుకొనడానికి వస్తున్న భారతీయులకు ఓ మంచి సందేశం ఇవ్వాలి. వారికి భరోసా కల్పించాలి. భారత్, అమెరికా దేశాలు ఎప్పటికి సహకార ధోరణినే పాటించాలి. అంతేకాని అమెరికాలో జన్మించిన విదేశీ పిల్లల విషయం పై పునరాలోచన చేస్తానని, వారికి అమెరికా పౌరసత్వం కల్పించడం వల్ల ఇక్కడి పౌరులుగా గుర్తించబడుతున్నారని ఇది సమూలంగా మార్చాలానే తలంపుతో ఉన్నారు. ట్రంప్‌కు పౌరసత్వ విషయం ప్రధానం కాకూడదు. ఇది అనసరంగా మాట్లాడితే న్యాయ పరమైన చిక్కులు వస్తాయి. అప్పుడు మళ్ళీ వ్యవహారం ముందుకు వస్తుంది. అమెరికా రాజ్యాంగాన్ని మార్చడం చాలా కష్ట సాధ్యం. అధ్యక్షునికి విశేషమైన అధికారాలు వున్నప్పటికి ఫెడరల్‌కోర్ట్‌సమీక్షిస్తూ ఉంటుంది.





ఇంకా కొన్ని అనాలోచిత చర్యలు విడనాడాలి. రెండోసారి పగ్గాలు చేపడుతున్నారు కనుక అమెరికా పౌరులు అయితేనేం, విదేశీ పౌరులు అయితేనేం వారికి భద్రత కల్పించాలి. అక్రమ వలసలు ఏ మాత్రం ఉండరాదు. అమెరికా రావాలంటే గుర్తింపు పాస్‌పోర్ట్ చాలా అవసరం. అమెరికా విదేశీ పర్యాటకుల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూరుతోంది. అంతేందుకు ఎక్కువగా టాక్స్ కట్టేది విదేశీయులే. అందులో భారత్ వాటా హెచ్చు. ఇవన్నీ మాములే. అయితే అమెరికా పౌరసత్వ విషయం తీసుకుంటే అమెరికా గడ్డపై జన్మించిన ఎవరికైనా విదేశీయులు, స్వదేశీయులు కావొచ్చు. వారికి అమెరికా పౌరసత్వం వస్తుంది. విదేశీయులకు అటువంటి పౌరసత్వం ఇవ్వం అనడంసబబు కాదు. ఇది పునః పరిశీలించుకోవాలి. అమెరికాలో జన్మించిన వారికే చట్ట సభలలో పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నపుడు, పౌరసత్వ విషయం ఆలోచించ వలసిన అవసరం లేదు. ప్రస్తుతం భారత మూలాలువున్న వారు వివిధ పదవులలో రాణిస్తున్నారు. పౌరసత్వం అంశం పరిగణలోకి తీసుకున్నపుడు విదేశీయులకు ఏ పదవీ ఇవ్వరాదు, అసలు ఎన్నికలలో పోటీ చేయరాదు కూడా. కనుక ట్రంప్ ఈ విషయం ఆలోచించాలి. స్వచ్ఛమైన అమెరికా పౌరులకే పోటీ చేసే అవకాశం, పదవులు అని ప్రకటిస్తే అది అమెరికా మనుగడకే ప్రమాదం. కనుక అమెరికాలో జన్మించిన విదేశీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్ కల్పించాలి. ట్రంప్ చేయాల్సిన పనిఇది కాదు. పరిపాలనలో సంస్కరణ లు, విదేశాలతో చక్కని దౌత్యం, ఎగుమతులు, దిగు మతులు విషయంలో సరళీకరణ, చిన్నదేశాలను ఆదుకోవడం చేయాలి. ●

# వలసల జిల్లా నుంచి వడివడిగా రేవంత్ అడుగులు

**మన్నారం నాగరాజు**

ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు కెసిఆర్‌ను ఎంపీగా గెలిపించి ఆశీర్వదించారు. తెలంగాణ ఉద్యమానికి ఆర్థిక, రాజకీయ, మానసిక బలాన్ని ఇచ్చిన ప్రధాన ఘట్టాలలో మహబూబ్‌నగర్ ప్రజలు ఉన్నారు. ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం వచ్చింది. కానీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా 9సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ఏమీ ఒరగలేదన్నది నగ్నసత్యం. ఏడాది క్రితం నవంబర్ 30, 2023 లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో వరుసగా రెండుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ పై కన్నేసిన బిఆర్ఎస్ సర్కార్‌ను ఓడించి మొదటిసారి కాంగ్రెస్ విజయం సాధించింది. ఇంకా చెప్పాలంటే రాజకీయ అపర చాణక్యుడిగా, తెలంగాణ గాంధీగా పేరున్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును సామాన్య నాయకుడు రేవంత్ రెడ్డి ఓడించారని చెప్పాలి. రేవంత్ రెడ్డి ఒక యువ, డైనమిక్ నాయకుడిగా తెలంగాణ ప్రజల కోసం కొత్త ఆశలునింపారు. రాజకీయ ప్రబల నాయకుడిగా ఆయనకు రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల సామాన్య ప్రజల అవసరాల గురించి మంచి అవగాహన ఉన్న నాయకుడు కేసీఆర్‌తో ఢీ అంటే ఢీ అని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కింది. కనీసం మంత్రిగా కూడా పనిచేయని ఆయన సీఎం పీఠమెక్కారు. డిసెంబర్ 7 హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేవంత్ రెడ్డి అనే నేను అంటూ ప్రమాణస్వీకారం చేసి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇలా కాంగ్రెస్ పాలనాపగ్గాలు చేపట్టి, రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది కావస్తోంది. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తోంది. అయితే, ఆయన నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ పాలన ఒక సంవత్సరం పూర్తి చేసుకున్నది. ఒక్క సంవత్సరంలో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారంటూ ప్రతిపక్ష బిజెపి, బిఆర్ఎస్‌లు, రేవంత్ సర్కారుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ విజయోత్సవాలకు పోటీగా నిరసనలకు సిద్ధమయ్యాయి ఈ రెండు పార్టీలు. ఇలా తాము ఎంతో చేసామని కాంగ్రెస్ సర్కార్ అంటుంటే... ఏమీ చేయలేరని బిఆర్ఎస్, బిజెపి అంటున్నాయి. ఈ క్రమంలో అసలు ఈ ఏడాది పాలనలో కాంగ్రెస్ పాలన ఎలా సాగింది? సాధించిన విజయాలు ఏమిటీ? ఎదురైన అడ్డంకులు ఏమిటీ? ప్రజలు ఈ పాలన గురించి ఏమనుకుంటున్నారనే అంశాలపై సుదీర్ఘంగా చర్చిద్దాం. ఇకదేశంలో మన తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన చరిత్ర, సాంస్కృతిక వైభవం, రాజకీయ ప్రాధాన్యతతో దేశానికి ప్రత్యేకంగా నిలుస్తుంది. 2024లో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన తర్వాత, రాష్ట్రం అభివృద్ధిలో అనేక కొత్తదారులు తొక్కుతూ ముందుకు సాగుతున్నది. వలసలజిల్లాగా పేరొంది మహబూబ్ నగర్ నుంచి తన రాజకీయ పోరాటం ప్రారంభించిన రేవంత్ రెడ్డి అనతి కాలంలో రాష్ట్రంలో ముఖ్యనేత అయ్యారు. ఇటీవల ఎన్నికల్లో పార్టీని గెలిపించి సీఎం అయ్యారు. అయితే, ఆయన ఏడాది పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు చూస్తే భాషపైన కూడా అవహేళన చేశారు. ఇది సహేతుకంకాదు. ఒక పరిపాలకుడిని పాలన కోణంలోనే చూడాలి. అడ్మినిస్ట్రేషన్ విధానంగానే విశ్లేషణ చేయాలి. ఏడాది కాలంలో స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ ఇవ్వలేనన్ని అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి, నిరుద్యోగాల ఆక్రందనలు, ఆర్తనాదాలను ఆకలింపు చేసుకొని ముందుకు నడిచింది. వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న మేరకు ఆరుగాలం కష్టపడిన రైతన్న సన్నబియ్యంకి బోనస్ ఇవ్వడం మనమంతా కండ్లారా చూశాం. 1947 నుంచి ఏ రాష్ట్రానికి సాధ్యం కాని అత్యధిక వరి ఉత్పత్తి కారణం. అది కూడా మన కాళేశ్వరరావు నిర్మించిన ప్రాజెక్టు నుంచి చుక్క నీరు వాడకుండా అంటే గొప్ప విషయం అవుతుంది కదా. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత చెరువుల పూడికతీత పేరు మీద చెరువుల పునరుద్ధరణ చేస్తాం అనుకున్నం. కానీ, కేసీఆర్ అనుచరులు, కార్యకర్తలంతా తెలంగాణలో ఉన్న చెరువులన్నీ కబ్జాలు చేసి కాంక్రీట్ జంగల్ మార్చేసిన ఉదంతాలన్నీ ప్రత్యక్షంగా చూశాం. 40 సంవత్సరాల తరువాత ఆక్రమణలు పూర్తిగా నిలిపివేత ప్రభుత్వం అడుగులు వేసింది. అందుకోసం ప్రత్యేకంగా హైడ్రా వంటి సంస్థలు ఏర్పాటు చేసింది. ఇక 50 సంవత్సరాలుగా నిరక్ష్యానికి గురైన మూసీ నది పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇచ్చి ఆ మేరకు స్పష్టమైన అడుగులు వేసింది. ఇక దాంతోపాటు, హైదరాబాదు వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేలా 50 సంవత్సరాల భవిష్యత్తుకు తగ్గట్టుగా మౌలిక వసతుల రూపకల్పన చేపట్టిన భారతదేశపు తొలి నగరం హైదరాబాద్ అనే విషయం అందరికీ తెలిసిందే. భారతదేశంలో మొదటి పరిశ్రమ ఆధారిత స్కిల్ యూనివర్సిటీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. ఇక దక్షిణ భారతదేశంలో అతిపెద్ద స్పోర్ట్స్ యూనివర్సిటీ పెట్టాలని సంకల్పించుకోవడం అంటే ఇక్కడి యువతను ప్రభుత్వం ఎంతమేర పట్టించుకుంటున్నదో తెలుస్తున్నది. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, రూ.500గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగానికి ఉచిత విద్యుత్ ద్వారా నెలకు దాదాపు రూ.10,000 ఆదా అవుతున్నది. రైతులకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ బస్సులను పూర్తిగాతొలగించి 3,000 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టడం కొత్తప్రభుత్వం చిత్తశుద్ధితో సాధ్యమైంది. బాపూఘాట్‌లో ప్రపంచంలోనే అతిపెద్దగాంధీ విగ్రహం, 200 ఎకరాల గాంధీస్మారక నిర్మా ణం నిర్ణయం ఆమేరకు అడుగులు వేస్తున్నది. హైదరాబాద్ ప్రజల అవసరాల కోసం గోదావరి నుంచి త్రాగునీరు సర ఫరా చర్యలు తీసుకుంటున్నది. భవిష్యత్ నగరప్రణాళికలు సిద్ధం భారత్ లోనే అత్యాధునిక నగరంగా హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌తోపాటు నాలుగో నగరంగా అభివృద్ధి ఏర్పాటు చేస్తున్నది. రెసిడెన్షియల్ పాఠశాలల పిల్లల కోసం ఆహార, కాస్మెటిక్ బడ్జెట్‌లు 10సంవత్సరాల తర్వాత పెంపు చేపట్టింది. మహిళా స్వయంసహాయక సంఘాలకు, పారిశ్రా మికవేత్తలకు రుణాలు, లక్షమంది మహిళా కోటీశ్వరులను సృష్టించే లక్ష్యంగా పెట్టుకున్నది. సమగ్ర కుల జన గణన విధానాలు, కేటాయింపుల సమీక్ష చేస్తున్నది. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రపంచస్థాయి రెసిడెన్షి యల్ పాఠశాలల నిర్మాణం చేపట్టాలని వేగంగా అడుగులు వేస్తున్నది. అవినీతితో కూడిన ధరణి పోర్టల్‌ను పూర్తిగా జాతీయసంస్థ ఎన్ఐసీకి అప్పగించి ముందుకువెళుతున్నది. భవిష్యత్ తరాలకు హానికరం కాకుండా మాదక ద్రవ్యాలపైపోరాటం మొదలుపెట్టారు. తొలిసంవత్సరంలోనే గరిష్ఠ పెట్టుబడుల ఆకర్షణ విదేశీ, దేశీయ, ప్రజాపెట్టుబడులు చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్లకోసం 400,000ఇళ్లకు ఆమోదం తెలపడం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి వ్యక్తికి రూ. 10 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్‌కేర్ అవకాశం కల్పించారు. ప్రజావాణిలో రూ.5లక్షల ప్రజా సమస్యల పరిష్కారం చేపట్టారు. ప్రతినెల మొదటి తేదీన ప్రభుత్వఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపు చేపిస్తున్న పరిస్థితి అందరికీ కనిపిస్తున్నది. చివరగా చెబుతున్న విషయం ఏమిటంటే, ప్రతి రోజూ 18 గంటలు పని చేసే ముఖ్య మంత్రి ఈ దేశంలో ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదు. ప్రజల సమస్యలను వినే శ్రద్ధ, పరిపాలనలో మెరుగుల కోసం ఫీడ్ బ్యాక్ తీసుకునే వినమ్రతవల్ల తెలంగాణ ఇప్పుడు నిజమైన భవిష్యత్ రాష్ట్రంగా ఎదుగుతోందన్నది అందరూగుర్తెరగాలి. ●

# ఢిల్లీలో ప్రతి మహిళకు రూ.1000



## ఎన్నికల తర్వాత నెలకు రూ. 2100 నేరుగా జమ

## అసెంబ్లీ ఎన్నికలకోసం ఆప్ ప్రభుత్వం నజరానాలు

**న్యూఢిల్లీ,డిసెంబరు 12:** కేంద్రపాలితప్రాంతం ఢిల్లీలో మహిళలకు ప్రతినెల వెయ్యిరూపాయలు నేరుగా లబ్ధిచేకూర్చనున్నట్లు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. వచ్చే ఏడాది తొలినాళ్లలో జరగనున్న ఎన్నికలకోసం ఇప్పటినుంచే కసరత్తులు మొదలుపెట్టిన కెజ్రీవాల్ ఎన్నికల్లో ఆప్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమ్ ఆద్మీప్రభుత్వంలో నెలనెలా మహిళలకు 2100 రూపాయలు ప్రయోజనం కల్పిస్తామని వెల్లడించారు. అయితే ఇందుకు సంబంధించి ఎన్నికలు పూర్తయినవెంటనే నెలకు వెయ్యిరూపాయలు ముందుగా వారి ఖాతాల్లో జమచేస్తామని పోలింగ్ తేదీలు మరో పది పదిహేను రోజుల్లో ప్రకటిస్తారని అందుల్ల నగదు బదిలీ వీలుపడదని చెప్పారు. ఆప్ అధినేత ముఖ్యమంత్రి అతిశి మోర్లేనాతో కలిసి మీడియాతో మాట్లాడారు. విపక్షంలోని భారతీయ జనతాపార్టీపై ఆరోపణలు గుప్పించారు. ఈ పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించిన వెంటనే తనపై కుట్రచేసి జైలుకు పంపించారని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ఢిల్లీ మహిళలకు గౌరవ భృతి లభించకుండాపోయిందని కెజ్రీవాల్ పేర్కొన్నారు. ఢిల్లీప్రజల కోసం రెండు పెద్ద హామీలు ఇవ్వబోతున్నామని, రెండూ కూడా మహిళలకోసమేనని చెప్పిన కేజ్రీవాల్ తాను గతంలో ప్రతి మహిళకు వెయ్యిరూపాయలు ఇస్తామని చెప్పానని, ఈప్రతిపాదన కేబినెట్ ఆమోదించిందని, ముఖ్యమంత్రి అతిశీజీ ఆధ్వర్యంలో సమావేశం ఆమోదించినట్లు తెలిపారు. ఈపథకాన్ని ఢిల్లీలో అమలుచేస్తామన్నారు. ఎన్నికలు మరో పదిపదిహేనురోజుల్లోనే ప్రకటిస్తారని, అందువల్ల ఖాతాలకు నేరుగా బదిలీ చేయడం వీలుకాదని అన్నారు.

కొందరు మహిళలు వెయ్యిరూపాయలు చాలదని ద్రవ్యోల్బణం పెరుగుదల, నిత్యావసరాల పెరుగుదల వల్ల వెయ్యిచాలదని చెప్పారని,అందువల్లనే రిజిస్ట్రేషన్లు నెలసరి 2100 రూపాయలకు ప్రారంభిస్తామన్నారు. ఈపథకం మహిళల సాధికారత, వారి ఆర్థిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. బిజెపి ఈ పథకంపై ఎన్నికల్లో ఉచితాలుగా ఆరోపించింది. దీనిపై ఆప్ స్పందిస్తూ ఈసొమ్ము ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నిస్తున్నారని, అయితే తాను ఉచిత విద్యుత్ హామీని 2015 ఢిల్లీ ఎన్నికల్లో ఇచ్చానని అదేవిధంగా ఇపుడు ఈ హామీని కూడా చేస్తామని అన్నారు. బిజెపినేతలు తనను తక్కువ చేస్తున్నారని, తాను ఒక మాంత్రికుడినని, లెక్కల మాంత్రికుడినని ఏదైనాచేయగలనని చిరునవ్వుతో చెప్పారు. సీనియర్ ఆప్ నాయకుడు మనీష్ సిసోడియా మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపిలు ఇలాంటి వాటిపై అసలు ఆలోచించరని, అందువల్లనే ప్రజలను క్షమించాలని కోరుతున్నారని అన్నారు. కేజ్రీవాల్ ఈపథకం ఎన్నికల తర్వాత నుంచి 2100గా అమలుచేసి చూపిస్తారన్నారు. దీనిపై ఢిల్లీ బిజెపినేత ప్రత్యారోపణలుచేస్తూ 2022 ఎన్నికల్లో ప్రతి ఒక్క మహిళ ఖాతాలో నెలకు 1000 జమచేస్తామని చెప్పిందని, ఇప్పటికీ అమలుకాలేదన్నారు.

ఈ సొమ్మును తర్వాత 1110గా పెంచారని పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ఇప్పటికీ ఈ పథకం అమలుచేయలేదని ఇపుడు కొత్తగా మరో పథకం వల్లెవేస్తున్నారని ఆరోపించారు. మహిళా సమ్మాన్‌యోజన పేరిట రెండువేల కోట్లు కేటాయింపులతో పథకం అమలుచేస్తామని, 2024/25 బడ్జెట్‌లోనే ఈపథకాన్ని చేర్చినట్లు మంత్రి వివరించారు.



# నేడు, రేపు సభకు తప్పక రండి..

## తమ ఎంపీలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** పార్లమెంటు సమావేశాల సందర్భంగా భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ పార్టీలు మూడు లైన్ల విప్ నోటీసును తమతమ సభ్యులందరికీ జారీచేసారు. శుక్ర, శని వారాల్లో విధిగా పార్లమెంటుకు హాజరుకావాలని, ఈరెండురోజుల్లోను రాజ్యాంగంపై చర్చలు జరుగు తున్నందున సభ్యులు విధిగా హాజరు కావాలని విప్‌జారీచేసింది. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లోక్‌సభలో 13వ తేదీ చర్చను కొనసాగిస్తామని, 13వ తేదీ శనివారం లోక్‌సభలోను, 14వ తేదీ డిసెంబరు రాజ్యసభలోను చర్చ ఉంటుందన్నారు. బిజెపి లోక్‌సభ సభ్యులు అందరూ సమిష్టిగా హాజరుకావాలని రెండురోజులు ఎలాంటి కారణాలు చెప్పకుండా హాజరుకావాలని కోరారు. ప్రభుత్వ వైఖరిని బిజెపి ఎన్డీయే సభ్యులంతా సమర్థించాలని బిజెపి జారీచేసిన నోట్‌లో పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ చర్చపై 14వ తేదీ స్పందిస్తారన్నారు.

హోంమంత్రి అమిత్‌షా ఈ ఈఅంశంపై చర్చను ప్రారంభిస్తారని రాజ్య సభలో డిసెంబరు 16వ తేదీ జరుగుతుంద న్నారు. పార్లమెంటు శీతాకాలసమావేశాలు గతనెల 25వ తేదీ ప్రారంభం అయ్యాయి. అప్పటినుంచి ఇప్పటి వరకూ తరచూ జరుగు తున్న అంతరాయాలతో నిరంతరం వాయిదాలు పడుతూనే వచ్చాయి. శీతాకాలసమావేశాలు ఈనెల 20వరకూ కొనసాగుతాయి.



## కేంద్రమంత్రి కిరణ్‌రిజిజుపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** కేంద్రమంత్రి కిరణ్ రిజిజుపై ప్రతిపక్ష ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేసారు. సభకు తాము అనర్హులమన్న ఆయన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు వ్యతిరేకంగా ప్రివిలేజ్‌మోషన్ నోటీసు ఇచ్చారు. ప్రతిపక్షాలకు చెందిన సుమారు 60 మందికిపైగా ఎంపిలు సభా హక్కుల తీర్మానానికి మద్దతు ప్రకటించారు. పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్ రిజిజు ముందురోజు సభలో ప్రతిపక్ష సభ్యులను విమర్శించారు. ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. ఈ క్రమంలోనే మీరు కుర్చీని గౌరవించలేకపోతే ఈ సభలో సభ్యులుగా ఉండే హక్కు మీకులేదు అని ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి అన్నారు. కాగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సాగరికా ఘోష్ దీనిపై స్పందించారు. ప్రతిపక్ష ఎంపిలు రాజ్యసభలో ఉండేందుకు అనర్హులన్న కేంద్ర మంత్రి కిరణ్ టిజిజుపై గురువారం సభాహక్కుల ఉల్లంఘన కింద నోటీసు ఇచ్చారు. ఈ తీర్మానంపై 60 మంది ప్రతిపక్ష ఎంపిలు సంతకాలుచేసినట్లు ఆమె తెలిపారు. మరోవైపు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభను సజావుగా నడపడానికి కృషిచేయడం లేదని ఎంపి సాగరికాఘోష్ విమర్శించారు. ఇందుకు బదులుగా ప్రతిపక్షాలను పదేపదే అవమానించడాన్ని ఆయన ఎంచుకున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులను రిజిజు అవమానించారు. పార్లమెంటు లోపల బయట వ్యక్తిగత పదాలు ఉపయోగించారు. ఆయన ఉన్నతపదవికి ఈ వ్యాఖ్యలు తగవని తన పదవిని ఆయన పూర్తిగా దుర్వినియోగం చేయడమేనని ఆమె అన్నారు.

# అసద్ సర్కారు జైళ్లను మూసేస్తాం

## సిరియా తిరుగుబాటు నేత జులానీ



**డమాస్కస్, డిసెంబరు 12:** సిరియాలో తమ వ్యతిరేకులను బంధించి హింసించేందుకు గతంలో బషర్ అల్ అసద్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్ని జైళ్లను మూసేస్తామని ఆ దేశ తిరుగుబాటు నాయకుడు అబు మహమ్మద్ అల్ జులానీ తెలిపారు. అంతేకాదు.. గతంలో ఉన్న సిరియా సైనిక దళాలను కూడా రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. అసద్ ప్రభుత్వం నిర్వహించిన జైళ్లలో కనీసం 60 వేల మందిని చిత్రవధ చేసి ఉంటారని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది.ఓ వైపు ఇజ్రాయెల్ మెరుపుదాడులు చేస్తుండటంతో.. ఎంత వేగంగా అసద్ దళాలను రద్దుచేస్తారనే విషయంపై స్పష్టతరాలేదు. ఇక దేశంలో రసాయన ఆయుధాలున్న ప్రదేశాలుగా అనుమానిస్తున్న ప్రదేశాలను అంతర్జాతీయ సంస్థలతో కలిసి సురక్షితంగా ఉంచుతామని జులానీ పేర్కొన్నారు.రాజధాని డమాస్కస్ శివార్లలోని 'సైద్నాయ' జైలును 'సిరియా వధశాల'గా అభివర్ణించేవారు. అక్కడే ఖైదీలను చిత్రహింసలకు గురిచేసేవారు. కరెంట్ షాక్‌లు, అత్యాచారాలు, హత్యలు వంటివి ఆ జైలులో జరిగినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకొంటుంటారు. ఇటీవల తిరుగుబాటుదారులు దేశాన్ని ఆక్రమించడంతో అసద్‌ల పాలన అంతమైంది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే పలు కారాగారాల్లోని బందీలను విడుదల చేశారు.

ఈ పరిణామాలపై పెంటగాన్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ సబ్రీనాసింగ్ మాట్లాడుతూ జులానీ నిర్ణయాన్ని అమెరికా స్వాగతిస్తుందన్నారు. కాకపోతే వారు చెప్పినదానిని ఆచరణలో చూపించాలని సూచించారు. ఆరసాయన ఆయుధాలను తప్పుడు బృందాల చేతిలో పడకుండా చేయడమే తమ లక్ష్యమని అమెరికా పేర్కొంది. జులానీ నేతృత్వంలోని హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) సంస్థ మిగిలిన రెబల్ గ్రూపులతో కలిసి సిరియాను ఆక్రమించుకొన్న తర్వాత ఇజ్రాయెల్ మెరుపుదాడులు మొదలుపెట్టింది. ఈ క్రమంలో కెమికల్ వెపన్స్ పరిశోధనశాలగా భావిస్తున్న భవనాన్ని ధ్వంసం చేసింది.

ఇతర ఉగ్రవాదవర్గాల చేతిలోకి ఆయుధాలు వెళ్లకుండా చేయడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ చెబుతోంది. మరోవైపు బషర్ అల్ అసద్ తండ్రి హఫీజ్ అల్ అసద్ సమాధిని రెబల్స్ ధ్వంసం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యూజియంను దహనం చేశారు. దీనికి సంబంధించిన విడియోలు వైరల్‌గా మారాయి.

# బ్రిటన్‌కు నూతన రాజు-రాణిగా విలియం-కేట్!



## బాధ్యతలకు సిద్ధమవుతున్న రాజ దంపతులు

**లండన్, డిసెంబరు 12:** బ్రిటన్ సామ్రాజ్యానికి కొత్త రాజు-రాణి రాబోతున్నారా? ప్రస్తుత రాజు కింగ్ ఛార్లెస్-3 తనయుడు, వేల్స్ యువరాజు విలియంకు త్వరలోనే పట్టాభిషేకం జరగనుందా? తాజా మీడియా కథనాలతో ఇలాంటి ఊహాగానాలు జోరందుకున్నాయి. ప్రిన్స్ విలియం, ఆయనసతీమణి కేట్ మిడిల్టన్ రాజు-రాణిగా బాధ్యతలు నిర్వర్తించేందుకు ముందుగానే సిద్ధమవుతున్నట్లు యుకె మీడియాలో వార్తలు వస్తున్నాయి. కేన్సర్ కారణంగా కింగ్ ఛార్లెస్-3 ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఈ ప్రచారం ఊపందుకుంది. రాజ కిరీటాన్ని ధరించేందుకు విలియం సిద్ధమవుతున్నారని రాయల్ బయోగ్రాఫర్ బెడెల్ స్మిత్ చెప్పినట్లుగా పీపుల్స్ మ్యాగజీన్‌లో ఓ కథనం వెలువడింది. 'ప్రస్తుతం రాజు తన విధులను పూర్తి సంకల్పంతోనే నిర్వహిస్తున్నప్పటికీ.. కేన్సర్ చికిత్స కారణంగా కొన్ని పరిమితులను అంగీకరించాల్సి వస్తోంది. ఈ పరిణామాలు చూస్తుంటే ఊహించిన దానికంటే ముందుగానే విలియం-కేట్ బ్రిటన్ రాజు-రాణిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనికి వారు కూడా ఇప్పటి నుంఏ సిద్ధమవుతున్నారు' అని స్మిత్ తెలిపారు.

రాణి ఎలిజబెత్ మరణం తర్వాత ఆమె కుమారుడు ఛార్లెస్-3 రాజుగా బాధ్యతలు చేపట్టారు. గతేడాది మే నెలలో ఆయన పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. అయితే, 76 యేళ్ల ఛార్లెస్-3 ఈ మధ్య తరచూ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. మరోవైపు కేన్సర్‌కు చికిత్స తీసుకుంటుండడంతో ఆయన ఆరోగ్యంపై రాజకుటుంబంలో ఆందోళనలు నెలకొన్నాయి. ఇటీవల పలు అధికారిక కార్యక్రమాలకు రాజుకు బదులుగా యువరాజు విలియం హాజరవ్వాల్సి వచ్చింది.

వాస్తవానికి 2023 మేనెలలో ఛార్లెస్-3 పట్టాభిషేకం జరిగిన తర్వాత నుంచే వారసత్వ ప్రణాళికలను కూడా అధికారికంగా మొదలుపెట్టారు. అయితే, ఈయేడాది ఆరంభం నుంచి రాజు అనారోగ్య కారణాల వల్ల వారసత్వ ప్రణాళికలను మరింత వేగవంతం చేసినట్లు రాజ కుటుంబ వర్గాలు చెబుతున్నాయి.కాగా.. ప్రిన్స్ విలియం దంపతులు ఇటీవల కొంత కఠిన సమయాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. సతీమణి కేట్ మిడిల్టన్ కేన్సర్ బారినపడ్డారు. దీంతోయువరాజు ఎక్కువ సమయం కుటుంబానికే కేటాయించాల్సి వచ్చింది. ప్రస్తుతం కేట్ కేన్సర్ నుంచి కోలుకొని ఇప్పుడిప్పుడే మళ్లీప్రజాజీవితంలోకి వస్తున్నారు.

# భారత్ ఆర్థికవృద్ధి 6.5% మాత్రమే

## ఆసియా అభివృద్ధి బ్యాంకు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** భారత్ స్థూలదేశీయోత్పత్తి (జిడిపి) 2024-25 సంవత్సరంలో 6.5శాతానికి పరిమితం కావచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనావేసింది. గతంలో ఆర్థిక వృద్ధి ఏడుశాతంగా ఉంటుందని ఎడిబి ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజా అంచనాల్లో 0.5శాతం కోతవిధించింది. ప్రైవేటు పెట్టుబడులు, ఇళ్లగిరాకీ అంచనాకంటే తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను కూడా 7.2శాతం నుంచి ఏడుశాతానికి సంస్థ సవరించింది. అమెరికా వాణిజ్యం, ఇమ్మిగ్రేషన్ విధానాల్లో మార్పులవల్ల ఆసియా, పసిఫిక్ దేశాల వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడవచ్చని ద్రవ్యోల్బణం కూడా పెరగవచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంకు వెల్లడించింది. తన తాజా నివేదిక ఆసియా డెవలప్‌మెంట్ ఔట్‌లుక్‌లో ఈవివరాలను ప్రకటించింది.

2024లో ఆసియా, పసి ఫిక్ దేశాలవృద్ధి 4.9శాతంగా ఉండవచ్చని ఎడిబి అంచనా వేసింది. సెప్టెంబరు అంచనాలోఇది ఐదు శాతంగా ఉంది. ఈఏడాది ఖరీఫ్‌నుంచి వ్యవసాయ దిగుబడులు అధికంగా రావచ్చని దీనివల్ల భారత ఆర్థిక వ్యవస్థ దూకుడుగా వెళ్లవచ్చని ఎడిబి పేర్కొంది. ఆహార దిగుబడులుకూడా తగ్గు తాయని వెల్లడిచేసింది. 2024, 2025 సంవత్సరాల్లో ముడిచమురు ధరలు అంచనాల కంటే తక్కువగా ఉంటాయని పేర్కొంది.

# శిక్ష తగ్గింపులో అమెరికా అధ్యక్షుడి దూకుడు

## ఒకేరోజు 1500 మంది ఖైదీలకు వర్తింపు, 39 మందికి క్షమాభిక్ష!

**వాషింగ్టన్, డిసెంబరు 12:** అమెరికా అధ్యక్షుడిగా పదవీ కాలం ముగుస్తోన్న వేళ జో బైడెన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్షమాభిక్షలు, శిక్ష తగ్గింపుల్లో దూకుడు కనబరుస్తున్న ఆయన గురువారం ఒక్క రోజే దాదాపు 1500 మంది ఖైదీలకు శిక్ష తగ్గించడంతో పాటు 39 మందికి క్షమాభిక్ష ప్రసాదించారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఒకేరోజు ఈ స్థాయిలో క్షమాభిక్షలు కల్పించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. కరోనా వైరస్ విజృంభణ సమయంలో అనేక మంది ఖైదీలను అమెరికా ప్రభుత్వం విడుదల చేసింది. జైళ్లలో వైరస్ వ్యాప్తి చెందకుండా ఈ చర్యలు చేపట్టింది. అప్పటికే ప్రతి అయిదుగురు ఖైదీల్లో ఒకరికి కొవిడ్ ఉన్నట్లు అంచనా వేసింది. ఇలా జైలు నుంచి విడుదలైన తర్వాత కనీసం ఏడాదిపాటు గృహ నిర్బంధంలో ఉన్న వారికి జో బైడెన్ శిక్ష తగ్గించాలని నిర్ణయించారు. ఇందులోభాగంగా గురువారం అనేక మందికి శిక్ష తగ్గించారు. రాబోయే రోజుల్లో మరింత మందికి శిక్షలు తగ్గించడంతో పాటు క్షమాభిక్ష పిటిషన్లను పరిశీలిస్తానని జో బైడెన్ పేర్కొన్నారు. అమెరికాలో ఒకేరోజుఈ స్థాయిలో శిక్షలు తగ్గించడం ఇదే తొలిసారి. గతంలో బరాక్ ఒబామా పదవీకాలం ముగిసే సమయంలో ఒకే రోజు 330మంది ఖైదీలకు శిక్ష తగ్గించగా ఇప్పటి వరకు అదే అత్యధికం. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ ఇప్పటివరకు 122 మందికి శిక్ష తగ్గించగా, మరో 21 మందికి క్షమాభిక్ష పెట్టారు. వీరిలో డ్రగ్స్ కేసులో శిక్ష అనుభవిస్తున్న వారితో పాటు స్వలింగ సంపర్కం నిబంధనలు ఉల్లంఘించిన వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ ఆయుధ కొనుగోళ్ల కేసులో దోషిగా తేలిన తన కుమారుడు హంటర్ బైడెన్‌కు జో బైడెన్ క్షమాభిక్ష ప్రసాదిస్తూ సంచలన నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశం. అనంతరం మరణశిక్ష ఎదుర్కొంటున్న వారితోపాటు అనేక మంది ఖైదీలకు శిక్ష తగ్గింపు లేదా క్షమాభిక్షలపై బైడెన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో 2020 అధ్యక్ష ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారికి శిక్ష తగ్గించాలి వద్దా? అన్న విషయంపై బైడెన్ ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది.

# ప్రమాణస్వీకారానికి జిన్‌పింగ్‌కు ట్రంప్ ఆహ్వానం

**వాషింగ్టన్, డిసెంబరు 12:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్‌ట్రంప్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోమరికొన్ని రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆహ్వానం పంపించారని తేలింది. జనవరి 20వ తేదీ ట్రంప్ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరిస్తారు. ఈకార్యక్రమానికి రావాలని జిన్‌పింగ్‌కు ఆహ్వానం పంపించారట. ఈ ఆహ్వానంపై వాషింగ్టన్‌లోనిచైనా రాయబార కార్యాలయం స్పందించలేదు. చైనా అధ్యక్షుడితో తనకు మంచి సంబంధాలున్నాయని, ఈమధ్యనే మేం మాట్లాడుకున్నామని ట్రంప్ వ్యాఖ్యలుచేసిన సంగతి తెలిసిందే. తాను అధికార బాధ్యతలు చేపట్టాక చైనా దిగుమతులపై 10శాతం సుంకం విధిస్తానని ట్రంప్ అన్నారు.

దీనిపై చైనాఅధ్యక్షుడు జిన్‌పింగ్ ధీటుగా స్పందించి చైనా అమెరికా మధ్య టారిఫ్, టెక్ యుద్ధాల్లో విజేతలుండరని అన్నారు. తమ దేశప్రయోజనాలను పరిరక్షించుకుంటామన్నారు. అమెరికాకుకాబోయే అధ్యక్షుడు డొనాల్డ్‌నేటా టైమ్స్ మ్యాగజైన్ ఇచ్చే పర్సన్ ఆఫ్‌ది ఇయర్ అవార్డుకు ఎంపికచేసింది. 2016లో ఒక పర్యాయం ట్రంప్ పర్సన్ ఆఫ్‌ది ఇయర్‌గా నిలిచారు. 2019అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినజోబైడెన్ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌లు నిలిచారు. గత ఏడాది ఈ టైటిల్‌ను పాప్‌స్టార్ టేలర్‌స్విఫ్ట్ అందుకున్నారు.



## ఇక 20 టన్నులతో జిఎస్ఎల్‌వి మార్క్ 3 క్రయోదశ

## ఇస్రో పరీక్ష విజయవంతం

## భవిష్యత్ ప్రయోగాలకు ఇది ఒక ముఖ్యమైన మైలురాయి

**శ్రీహరికోట (తడ), డిసెంబరు 12 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మన బాహుబలి రాకెట్‌లో మార్పులు తీసుకురానుంది. ఇప్పటిదాకా క్రయో ఇంజన్ దశ 25 టన్నులతో రూపొందిస్తుండగా దాన్ని 20 టన్నులకు కుదించి నిర్మించడానికి మార్గం చూస్తున్నారు. ఇందుకు సంబంధించి సి-20 క్రయో ఇంజన్‌ను మహేంద్రగిరిలోని ఐపిఆర్‌సిలో విజయవంతంగా పరీక్ష చేశారు. బాహుబలిగా పిలిచే జిఎస్ఎల్‌వి మార్క్3 రాకెట్‌తో నాలుగు టన్నుల బరువు ఉన్న ఉపగ్రహాలను కూడా అంతరిక్షంలోకి చేరుస్తున్నారు. చంద్రయాన్3 ప్రయోగం ఈ రాకెట్ ద్వారానే నిర్వహించారు.

ఇటువంటి కీలకమైన రాకెట్ నిర్మాణానికి కొన్ని మార్పులు చేసి మరింత సౌకర్యంగా ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి చేర్చేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తూ ఈ తొలి అడుగు వేశారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో భవిష్యత్‌లో ఇస్రో ఆధ్వర్యాన జరిగే మరిన్ని ప్రయోగాలకు మరింత బలాన్ని ఇస్తుందని నమ్ముతున్నారు. ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# ఆరు డివిజన్లు రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కైవసం

## రైల్వే ఎన్నికల ఫలితాల్లో షరా మామూలే

**గుంతకల్లు రైల్వే,డిసెంబరు 12,ప్రభాతవార్త:** రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలలో మొదటి నుంచి అందరూ అనుకున్నట్లుగానే జరిగింది. రైల్వేలో ప్రతిష్టాత్మకంగా జరిగిన రహస్య బ్యాలెట్ ఎన్నికలు లక్షలు కుమ్మరించిన, మద్యం,బిరియానీ పొట్లాలు విచ్చలవిడిగా పంచినప్పటికీ ఓటరు మహాశయులు మాత్రం తాము ఎవరికి ఓటు వేయాలో ముందుగా తీసుకున్న నిర్ణయం మేరకే తమ ఓటు వేసి పట్టం కట్టారు. దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కేంద్రంతో పాటు 6డివిజన్లు,మరో మూడు రైల్వే వర్క్ షాపులు, వెరసి మొత్తం 10డివిజన్‌లలో ఆరింటిని 42.91శాతంతో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కైవసం చేసుకోగా, మరో నాలుగింటిని 4.55 శాతం ఆధిక్యంతో రైల్వే మజ్దూర్ యూనియన్ దక్కించుకుంది. తిరుపతి వర్క్‌షాప్‌లో మూడు ఓట్ల మెజార్టీతో ఎంప్లాయిస్ సంఘ్ గట్టెక్కగా, గుంటూరు డివిజన్‌లో 376ఓట్ల ఆధిక్యంతోను, లాలాగూడ వర్క్‌షాప్‌లో 234ఓట్ల మెజార్టీ తోను, నాందేడ్ డివిజన్‌లో 331ఓట్ల మెజా ర్టీతో, గుంతకల్లు డివిజన్‌లో 187ఓట్ల మెజార్టీతో ఎంప్లాయిస్ సంఘ్ జయకేతనం ఎగురవేసింది. అలాగే జోనల్ ప్రధాన కేంద్రంలో 64ఓట్ల మెజా ర్టీతోను, గుంటుపల్లి వర్క్‌షాప్‌లో 52ఓట్ల మెజార్టీతో,విజయవాడ డివిజన్‌లో 1,682ఓట్ల మెజార్టీతో,సికింద్రాబాద్ డివిజన్‌లో 2,663ఓట్ల ఆధిక్యంతో మజ్దూర్‌యూనియన్ విజయం సాధించింది. ఈ ఎన్నికలలో మజ్దూర్ యూనియన్‌కు అత్య ధికంగా 47.46శాతం ఓట్లు పోల్ కాగా, ఎంప్లా యిస్ సంఘ్‌కు 42.91శాతం ఓట్లు పోల్ అయ్యాయి.


దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
"ఆదా చేసిన విద్యుత్ ఉత్పత్తి సాధించినట్లే"
టెండర్ ప్రకటన (పత్రికా ప్రకటన-11/24-25)

T&D Imp పనుల క్రింద ఇ-ప్రొక్యూర్‌మెంట్ క్రింద బిడ్స్ కోరబడుతున్నవి. (1వ విస్తరణ) క్ర.సం.1 నుండి 10: CE/MP జోన్ యొక్క SP.Nos 31/32/33/37/38/39/40/41/42/43 అసింటిక్/24-25. మొత్తం 10. బిడ్ యొక్క అప్‌లోడ్ కొరకు చివరి తేదీ 20.12.2024 మ.15.00గం. వద్ద మరియు హార్డ్ కాపీల దాఖలు తేదీ: 21.12.2024 మ.12.00గం.) మరియు 11) SP.No.44/24-25 ఆఫ్ CE/MP జోన్ (సంక్షిప్త టెండర్) 33KV ఎల్‌టిఫీడర్ యొక్క విద్యుత్ ఖాళీ చేయడం EHT బొరంపేట్ SS నుండి 33/11KV ఎల్‌ప్ సబ్‌స్టేషన్‌కు (బిడ్ ప్రారంభం తేదీ: 13.12.2024 సా.17.00గం. వద్ద, బిడ్ యొక్క అప్‌లోడ్ కొరకు చివరి తేదీ: 20.12.2024 మ.15.00గం. వద్ద మరియు హార్డ్ కాపీల దాఖలు తేదీ: 21.12.2024 మ.12.00గం.). గమనిక : ఈ సంబంధిత ఏ తదుపరి సమాచారమైనా వెబ్‌సైట్‌పై పొందవచ్చును. https://tgsouthernpower.org/generaltenders
సం/-. చీఫ్ ఇంజనీర్, మాస్టర్ ప్లాన్ జోన్, TGSPDCL, మింట్ కాంపౌండ్, హైదరాబాద్.
DIPR.NO. 7799-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 12.12.2024



पावरग्रिड POWERGRID

ప్రకటన

1. 2019-24కు సంబంధించి ట్రాన్స్‌మిషన్ టారిఫ్ ట్రూయింగ్ అప్ (వాస్తవిక ఆదాయ వ్యయాల సమీక్ష) కోసం మరియు "దక్షిణాది ప్రాంతంలో NLC-II ట్రాన్స్‌మిషన్ పద్ధతి" క్రింద ఆస్తుల కొరకు 2024-29 టారిఫ్ బ్లాక్‌కు టారిఫ్ ట్రాన్స్‌మిషన్ యొక్క నిర్ధారణకు సంబంధించి పిటిషన్.
2. పైన పేర్కొన్న ప్రసార విధానం వలన లబ్ధిదారులు: (a) TANGEDCO (b) TSNPDCL (c) KSEB (d) TSSPDCL (e) గోవా యొక్క విద్యుచ్ఛక్తి విభాగం (f) పుదుచ్చేరి యొక్క విద్యుచ్ఛక్తి విభాగం (g) APEDCL (h) APSPDCL (i) CESC (j) MESCOM (k) BESCOM (l) GESCOM (m) HESCOM (n) APCPDCL (o) KPTCL
3. టారిఫ్ వివరాలు:
a) 2019-24 బ్లాక్ రూ.లక్షలలో

| ఆస్తి వివరణ | DOCO/ ECOD | 31.03.2024 నాటికి పూర్తి చేయడానికి ధర | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 |
|---|---|---|---|---|---|---|---|
| | | | ట్రూయింగ్ అప్ పై ఆధారపడిన సవరించబడిన AFC | | | | |
| ఆస్తి-I(A) (అసలైన ఆస్తి) | 01.10.1991 | 47277.28 | 6752.24 | 6746.25 | 6796.08 | 6872.72 | 6889.46 |
| ఆస్తి-I(B) (కొత్త ఐటమ్‌లు) | | | 201.75 | 537.41 | 725.11 | 889.31 | 1367.03 |

b) 2024-29 బ్లాక్ రూ.లక్షలలో

| ఆస్తి వివరణ | 31.03.2029 నాటికి పూర్తి చేయడానికి ధర | 2024-25 | 2025-26 | 2026-27 | 2027-28 | 2028-29 |
|---|---|---|---|---|---|---|
| | | వార్షికంగా స్థిర ఛార్జ్ (AFC) | | | | |
| ఆస్తి-I(A)(అసలైన ఆస్తి) | 49805.31 | 6330.18 | 4144.27 | 4196.19 | 4250.06 | 4313.40 |
| ఆస్తి-I(B) (కొత్త ఐటమ్‌లు) | | 1810.74 | 1954.59 | 2097.17 | 2327.74 | 2571.78 |

4. టారిఫ్ నిర్ణయ నిర్ధారణ కొరకు తయారు చేయబడిన దరఖాస్తు యొక్క ఒక కాపీ, దరఖాస్తుదారుని వెబ్‌సైట్ పై www.powergrid.in వద్ద ఉంచబడినది.
5. టారిఫ్ నిర్ణయ నిర్ధారణ ప్రతిపాదనలపై దరఖాస్తులోని ఏవైనా సూచనలు మరియు అభ్యంతరాలు ఉంటే ఏ వ్యక్తి అయినా లబ్ధిదారుడు అయినా సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, 6వ, 7వ & 8వ అంతస్తు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, న్యూఢిల్లీ-110029 (లేదా కమిషన్ యొక్క కార్యాలయము ఉన్న ఇతర చిరునామా)కు దరఖాస్తుదారునికి ఒక కాపీతో దాని కార్పొరేట్ కార్యాలయం చిరునామా వద్దకు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపుగా పంపవలెను.

ప్రదేశం: గురుగ్రామ్ సం/-
తేది: 09.12.2024 చీఫ్ జనరల్ మేనేజర్ (కమర్షియల్)

PG/NOTICE/2024/D360

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(ఒక భారత ప్రభుత్వ ఎంటర్‌ప్రైజ్)
రిజిస్టర్డ్ కార్యాలయం: B-9, కుతబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూఢిల్లీ-110016
కార్పొరేట్ కార్యాలయం: సౌదామిని, ప్లాట్ సం.2, సెక్టార్-29, గురుగ్రామ్-122001, (హర్యానా)
wwww.powegrid.in, CIN: L40101DL1989GOI038121
ఒక మహారత్న PSU

# ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడలు నిర్వహిస్తాం

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**త్వరలోనే ఎమ్మెల్యేలకు స్టడీ టూర్లు: మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి**

**ముగిసిన 2 రోజుల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణా కార్యక్రమాలు**



గురువారం మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** శాసనసభ్యులకు క్రీడలు నిర్వహించడం, స్టడీ టూర్ లకు పంపడం వంటి కార్యక్రమాలు జరుపుతామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శాసనసభ కార్య విధానం, కార్యక్రమ నిర్వహణ నియమావళిపై ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు జూబ్లీహిల్స్ లోని మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల అవగాహన సదస్సు ముగింపు కార్య క్రమం గురువారం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారి అధికారికంగా శాసన పరిషత్తు, శాసనసభ సభ్యులకు ఇలాంటి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాసన వ్యవహారాలు తెలుసుకోవాలనే ఆసక్తితో సభ్యులు హాజరయ్యారు. చాలా సంతోషం. ఈ రెండు రోజుల ఓరియెంటేషన్ ప్రోగ్రాం ద్వారా శాసన పరిషత్తు, శాసనసభలలో హక్కులు, బాధ్యతలు తెలుసుకున్నారని తెలిపారు. మనం ఎంత థియరీ నేర్చుకున్నా దానిని ప్రాక్టికల్ గా ఇంప్లిమెంట్ చేస్తేనే దానికి విలువ, నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. తెలుసుకున్న విషయాలను వచ్చే సమావేశాలలో అమలు చేయడం ద్వారా సభ్యులకు మంచి పేరు వస్తుంది, గౌరవం పెరుగుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన పిఆర్ఎస్ రీసెర్చ్ ఇనిస్యిటూట్ ఎక్స్ పర్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు. సదస్సు నిర్వాహనకు సహకరించిన ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు ఈ సదస్సును విజయవంతం చేసిన లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన సదస్సులు తరచుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంప్రదాయనికి నాంది పలికిందని, గతంలో ఎప్పుడు నిర్వహించని విధంగా ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు లెజిస్లేచర్ విధి విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకున్నామన్నారు. ప్రభుత్వం సహకారం అందిస్తే త్వరలోనే అసెంబ్లీ, శాసన మండలి అన్ని కమిటీలను పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే స్టడీ టూర్‌లను కూడా ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్, లెజిస్లేచర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు 17 మంది, శాసనసభ సభ్యులు 61 మంది పాల్గొన్నారు.



## బాలామృతం ముడిసరకుల్లో నాణ్యత లోపాన్ని సహించేది లేదు

**మంత్రి సీతక్క హెచ్చరిక**

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** బాలామృతం ముడి సరుకుల్లో నాణ్యత లోపాన్ని సహించేది లేదని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు. గురువారం తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో టిజి ఫుడ్స్‌పై మంత్రి సీతక్క అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఎ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, తెలంగాణ ఫుడ్స్ అధికారులు హాజరు అయ్యారు. ఫుడ్ కార్పొరేషన్ పనితీరుపై మంత్రి సీతక్క అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించడం పట్ల మంత్రి సీతక్క అసహనం వ్యక్తం చేశారు. ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నా, తీరు మార్చు కోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులంతా పారదర్శకంగా వ్యవహరించాలని, నిస్పక్ష పాతంగా నిర్వహించాలన్నారు. కారుణ్య నియామకాలు, పదోన్నతుల్లో నిబంధనల ఉల్లంఘన జరగడం పట్ల ఆగ్రహం అయ్యారు. నాణ్యత లేని, శుభ్రత లేని సరుకులు సప్లై చేసిన కాంట్రాక్టర్లకు నోటీసువ్వాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. అంగన్‌వాడి చిన్నారులకు సరఫరా చేసే బాల అమృతంను తయారీ చేస్తున్న టిజి ఫుడ్స్‌పై ఎంతో బాధ్యత ఉందన్నారు. బాల అమృతం ముడి సరుకుల్లో నాణ్యత లోపాన్ని సహించేది లేదన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు, సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తప్పులు జరిగితే చర్యలు తీసుకోండి, సస్పెండ్ చేయాలంటూ ఉన్నతాధికారులకు సూచించారు. ఒక టీం లాగా పనిచేయాలని, అంతా ఒక యూనిట్, ఆ యూనిట్‌లో అందరం బాగాస్వాములం అవుతామన్నారు. టీం వర్క్ లాగా చేస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. అంగన్‌వాడి చిన్నారులకు ఆహారం సప్లై చేసే విభాగం లో ఉన్నామని, సరుకుల సప్లయర్స్‌తో రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. భువనగిరిలో బాలామృతం దారి మళ్లింపు ఘటనలో విచారణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర విచారణ చేసి బాధ్యులను విధుల నుంచి తొలగించాలన్నారు. పబ్లిక్ నుంచి వచ్చిన వ్యక్తి ఫహీం ఆయన ఆదేశాలు పాటించండి, క్వాలిటీ మైంటైన్ చేయాలన్నారు. ప్రతీది రాతపూర్వకంగా నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించారు. వాట్సాప్ మెసేజ్‌లతో పనులు కావన్నారు. దాపరికలు వద్దు, అవకతవకలకు పాల్పడే సప్లై కఠినంగా గమనించాలన్నారు. టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలని, ఎవరికి కొమ్ము కాయాల్సిన అవసరం లేదన్నారు. ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలు విడనాడాలన్నారు. సమిష్టి నిర్ణయాలను పకడ్బందీగా అమలు చేయాలని, మీ తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని సూచించారు. లక్షల మంది చిన్నారుల భవితవ్యంతో కూడుకున్న అంశం, బాధ్యతతో విధులు నిర్వహించాలని, లేకపోతే విధుల నుంచి తొలగిస్తామని అన్నారు.

## ఐజెఎస్‌ఒ-2024 వేదికపై సత్తాచాటిన నారాయణ

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడిన ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్(ఐజెఎస్‌వో-2024)లో నారాయణ విద్యార్థులు అదరగొట్టారు. 2024 డిసెంబర్ 1 నుంచి 11వ తేది వరకు రొమేనియాలోని బుకారెస్ట్‌లో జరిగిన 21వ ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ ఫైనల్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి తమ అద్భుత ప్రతిభతో భవ్య గున్వాల్ మరియు శేతాంక్ అగర్వాల్ ఇరువురు గోల్డ్‌మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఐజెఎస్‌వో అనేది 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పోటీ. విద్యార్థులోలన శాస్త్రీయ జ్ఞానం మరియు అవగాహనను ప్రోత్సహించడం మరియు సైన్స్ పట్ల వారి ఆసక్తిని పెంపొందించడం ఐజెఎస్‌వో యొక్క ప్రధాన లక్ష్యం. పోటీలో పాల్గొనేవారు వారి సైద్ధాంతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు శాస్త్రాయ భావనలపై ఆచరణాత్మక అవగాహనపై పరీక్షించబడతారు. ఈ అద్భుత విజయం సాధించడం పట్ల నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పి సింధూర నారాయణ మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు సాధించిన ఈ ఘనవిజయం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. నారాయణ విద్యార్థుల అంకితభావం, పట్టుదల, కృషి మరియు సరైన మార్గదర్శకత్వం కారణంగా ఎలాంటి అద్భుతాలు సాధించవచ్చో మరోసారి నిరూపించారన్నారు. ఐజెఎస్‌వో 2024లో భవ్య మరియు శ్వేతాంక్ విజయం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, ప్రపంచ వైజ్ఞానిక రంగాల్లో భారతదేశ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. వారి ప్రయానంలో నారాయణ కీలక పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉందన్నారు. అలాగే ఈ విజయం పట్ల నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి శరణినారాయణ తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఉత్సుకతను పెంపొందించడం ఆవిష్కరణల వైపు నడిపించడం మరియు ఏదైనా ఆసక్తిగల రంగాలలో రాణించగల నైపుణ్యాలతో నారాయణ విద్యార్థులను సన్నద్ధం చేయడానికి నారాయణ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఐజెఎస్‌వోలో నారాయణ విద్యార్థులు సాధించిన విజయాలు పెద్ద కలలు కనే ప్రతి విద్యార్థికి స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ ఘనత నారాయణ కుటుంబానికి, యావత్ భారత దేశానికి మధురైన క్షణాలుగా అభివర్ణించారు. ఘనతసాధించిన వారికి వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకి నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కె పునిత్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# రెండు సెట్స్ కన్వీనర్ల మార్పు?

**సెట్స్ నిర్వహణపై ఉన్నత విద్యామండలి కసరత్తు షురూ**

**కన్వీనర్లను ఎంపిక చేయాలంటూ విసిలకు లేఖలు**

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ పరీక్షలపై తెలంగాణ ఉన్నత విద్యా మండలి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, ఎడ్ సెట్, ఐ సెట్, లాసెట్, పీజీ లాసెట్, ఈ సెట్, పీజీఈసెట్, పీఈసెట్‌ల నిర్వహణపై ఉన్నత విద్యా మండలి కసరత్తును ప్రారంభించింది. 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్‌లను వచ్చే ఏడాది ఏప్రిల్, మే చివరి నాటికే పూర్తి చేయాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. అందులో భాగంగా వివిధ సెట్స్‌ను నిర్వహించే యూనివర్సిటీలకి కన్వీనర్లను ఎంపిక చేయాలని పేర్కొంటూ ఉన్నత విద్యా మండలి లేఖలను రాసినట్టు తెలుస్తోంది. కన్వీనర్ల కోసం యూనివర్సిటీ నుంచి వచ్చే ప్రతిపాదనల ఆధారంగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ కన్వీనర్లను ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో ముందుగానే కన్వీనర్లను ఎంపిక చేసుకుంటే.. అందుకు సంబంధించిన పనులను ప్రారంభిం చడానికి అవకాశం ఉంటుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఈ ఏడాది నిర్వహించిన సెట్స్‌లో రెండు సెట్స్‌కి వచ్చే ఏడాది కన్వీనర్లు మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఐ సెట్ కన్వీనర్ మారే అవకాశం ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఐ సెట్ కన్వీనర్‌గా నియమించిన వ్యక్తిపై యూనివర్సిటీ నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తం అయినప్పటికీ.. అప్పటి వీసీ తాము సూచించిన వ్యక్తి కాకుండా వేరే వారిని ఎవరిని నియమిస్తారో నియమించండి అంటూ ఉన్నత విద్యా మండలిని ప్రశ్నించడంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో ఐ సెట్ కన్వీనర్ నియామకం జరిగింది. అయితే వచ్చే ఏడాది నిర్వహించే ఐ సెట్-2025 కన్వీనర్ మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దాంతోపాటు ఎక్కువ మంది హాజరయ్యే ఎప్ సెట్(ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) కన్వీనర్ కూడా మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది ఎపన సెట్‌ను గత కొన్ని సంవత్సరాలుగా జేఎన్‌టీయూ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు

**ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు, గ్రామస్థులు**

**వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్**

**ధారూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త:** కీచకుడికి మారు పేరుగా కిష్టయ్యను పోల్చవచ్చు. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగినా బుద్ధి మారలేదు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఇలాంటి ఘటనలు అతడు పరిపాటిగా చేస్తుం టాడు. ప్రభుత్వాలు, అధికారులు ఆ కీచక ఉపాధ్యాయుడుకి అండగా ఉండటంతో బయటికి వచ్చేయడం.. యధావిధిగా విధులు నిర్వహిం చడం ఉపాధ్యాయుడు కిష్టయ్యకు షరా మామూ లైంది. వెంటనే ఆ ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ధారూ రు మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం ధారూర్ స్టేషన్ ప్రాథమిక ఉన్నత పాఠ శాల లో(యుపిఎస్) తెలుగు ఉపాధ్యాయుడిగా నవాబు పేట్ మండలానికి చెందిన కిష్టయ్య విధులు నిర్వహిస్తున్నాడు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు కిష్టయ్య కొంతకాలంగా అసభ్యంగా వ్యవహరిస్తున్నాడు. వెకిలి చేష్టలతో విద్యార్థినులను తాక కూడని చోట నిమరడం వంటివి చేస్తున్నాడు. ఈ ఉపాధ్యాయుడు వెకిలి చేష్టలు, వేధింపులు భరిం చలేక విద్యార్థినులు ఇంటికి వెళ్లి వారి తల్లిదం డ్రులకు విషయం తెలియ జేశారు. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రా మానికి చెందిన యువ కులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు కిష్టయ్య ను నిలదీశారు. దీంతో కిష్టయ్య అక్కడి నుంచి జారుకున్నాడు. ఉపాధ్యా యుడిని కఠినంగా శిక్షించాలని, వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.



బాధిత విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా : ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి**

పాఠశాల వద్ద ఆందోళన జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థుల తండ్రులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం సరైందికాదని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి ఉపాధ్యాయుడిపై తగు చర్యలు తీసుకునేలా తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## ఓపెన్ స్కూల్ సొసైటీలో టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు 16వ తేదీకి పెంపు

**ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి**

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరడానికి అడ్మిషన్ల గడువును పొడిగించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరడానికి ఈ నెల 16 వరకు అవకాశం కల్పిం చినట్టు ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీవీ శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను ఈ నెల 16 లోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలన్నారు. అడ్మిషన్లను ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 17లోపుగా వారు చేరాలనుకున్న స్కూల్, కాలేజీల్లో వారికి అడ్మిషన్లకు సంబంధించిన అర్హత పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని డైరెక్టర్ శ్రీహరి స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

## మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించకుంటే అంతుచూస్తాం

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల హెచ్చరిక**

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 12, ప్రభాతవార్త:** మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించకపోతే లక్షలాదిమంది బిసిలతో పెరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వం అంతుచూస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించకపోవడం వల్ల పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని, సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిడికెడు మంది లేని రెడ్డి, వెలమ సామాజికవర్గాలకు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికంగా మంత్రి పదవులు కట్టబెట్టిందని, ఆ విధంగా కా ంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తామన్నారు.

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెలమ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంత్రిపదవి ఇవ్వాలని కోరడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎక్సైజ్ శాఖ గౌడ సామాజిక వర్గానికి, చేనేత, జౌళి శాఖలు పద్మశాలి సామాజిక వర్గాలకు కేటాయించాలని కోరారు. సమావేశంలో బిసి నేతలు బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కుందారం గణేషాచారి, ఐయిలి వెంకన్నగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి

**కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్‌మేఘ్‌వాల్‌కు ఉపాధ్యాయుల వినతి**

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్‌ని కలిసిన తమకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి ఉపాధ్యాయులు గురువారం ఢిల్లీలో వినతిపత్రం సమర్పించారు. ప్రా థమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో ఓటు హక్కు సాధన కోసం కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్‌ని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన భీమనబోయిన కృష్ణమూర్తి, నల్గొండ జిల్లాకు చెందిన కర్నాటి శరత్ బాబు ఉస్మానియా యూనివర్సిటీ బీసీ నేత చెన్న శ్రీకాంత్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే క్యాబినెట్‌లో చర్చించి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ విషయంపై వివరణ గురించి మంత్రి గారితో చర్చించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీలో ఓటు హక్కు కల్పించడం కోసం చేయవలసినటువంటి చట్టపరమైన రాజ్యాంగ పరమైనటువంటి అంశాలని పరిశీలించి క్యాబినెట్ లో చర్చించి రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా అతి త్వరలో వివిధ రాష్ట్రాల్లో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్‌కు ఓటు హక్కు కల్పిస్తామని కేంద్ర న్యాయశాఖ మంత్రి హామీ ఇవ్వడం జరిగిందనీ ఉపాధ్యాయుడు బి కృష్ణమూర్తి తెలిపారు.

## వచ్చే యేడాది మరో ఆరు ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు

**ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్**

**ప్రభుత్వానికి సాంకేతిక విద్యాశాఖ ప్రతిపాదనలు**

**ప్రభుత్వ అనుమతి తర్వాత ఎఐసిటిఇ అనుమతి కోరనున్న సర్కారు**

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే ఏడాది మరో 6 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుగా కొనసాగుతున్న ఆరింటిని ఇంజనీరింగ్ కాలేజీలుగా ఉన్నతీకరించడానికి రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రభుత్వం అనుమతిస్తే వచ్చే ఏడాది 2025-26 విద్యా సంవత్సరం నుంచి సంబంధిత 6 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయితే ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్‌ను విద్యాశాఖ అనుమతించగా.. ఆర్థిక శాఖ అనుమతి కోసం పంపించినట్టు తెలుస్తోంది. ఆర్థిక శాఖ అనుమతి అనంతరం ప్రభుత్వం ఆయా 6 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయనుంది. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన అనంతరం.. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) అనుమతి కోరుతూ ప్రభుత్వం లేఖ రాయాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ అనుమతి వస్తే వచ్చే ఏడాది ఆయా కాలేజీల్లో ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లను తీసుకుంటారు. అయితే ఇంజనీరింగ్ కాలేజీలుగా మారున్న 6 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు కూడా జీహెచ్‌ఎంసీ పరిధిలోని కావడం విశేషం. రాష్ట్రంలో తొలిసారిగా ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్నతీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మరో ఆరింటిని అప్‌గ్రేడ్ చేయనుంది. రాష్ట్రంలో 57 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లుండగా.. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే 12 కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లిలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ (జీఐవోఈ), మహిళా పాలిటెక్నిక్ కళాశాల, రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, బహదూర్‌పురలోని కులీకుతుబ్‌షా పాలిటెక్నిక్, అమీర్‌పేటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్(మహిళలు). అలాగే బడంగ్‌పేట పాలిటెక్నిక్ కాలేజీ(మహిళ, మైనారిటీ)లను ఇంజినీరింగ్ కళాశాలలుగా ఉన్నతీకరించనున్నారు. జీఐవోఈలో ఎలక్ట్రానిక్స్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ మరియు మారేడ్‌పల్లి పాలిటెక్నిక్‌లలో సీఎస్ఈ, రామంతపూర్ పాలిటెక్నిక్‌లో సివిల్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టడానికి అనుమతి కోరుతూ ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో వచ్చే ఏడాది ఈ కోర్సులను ఆయా కాలేజీల్లో ప్రారంభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## అప్‌గ్రేడేషన్ కారణంగా నాలుగు రోజులు ధరణి సేవలు బంద్

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు ధరణి పోర్టల్ సేవలు బంద్ కానున్నాయి. డేటా బేస్ వెర్షన్ అప్ గ్రేడ్ జరుగుతున్న నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి అప్‌గ్రేడేషన్ ప్రారంభం కాగా, సోమవారం అంటే ఈనెల 16వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. దీంతో ఈ నాలుగు రోజుల పాటు ధరణి సేవలు అందుబాటులో ఉండవు. కాగా, గత మూడు రోజులుగా ధరణి సేవలు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఓటిపిలు రావడం లేదని మీ సేవా నిర్వాహకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు రెండు రోజుల పాటు ధరణి పోర్టల్ ద్వారా కేవలం సేల్ డీడ్ మాత్రమే అయ్యాయి. టీఎం 33, గిఫ్ట్ డీడ్స్ వంటి మాడ్యుల్స్ పనిచేయలేదు. మధ్యమధ్యలో సైట్ లోడింగ్ అని చూపించింది. టెర్రాసిస్ సృష్టించిన సాఫ్ట్‌వేర్, పోర్టల్‌ని యధాతథంగా వాడటం ద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ధరణి పోర్టల్‌లో 35 మాడ్యుళ్లతో గందరగోళం నెలకొన్నది. దీన్ని సరళీకృతం చేసే పనిని ఎంతగా చేపట్టినా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సమాచారం. తక్కువ మాడ్యుల్స్‌తోనే రైతులకు సేవలం దించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏ సమస్య ఉన్నా ఒక్క మాడ్యుల్ కిందనే దరఖాస్తు చేసుకునే వెలుబాటును తీసుకురానున్నారు. ఐతే టెర్రాసిస్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన ఎన్ఐసీకి కూడా తలనొప్పిగా మారిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

# బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

**ఎమ్మెల్సీ కవిత**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

## అధికారంలోకి వచ్చిన మమ్మల్నిచూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్

### రాహుల్‌గాంధికి కెటిఆర్ లేఖ రాయడం హాస్యాస్పదం

### ఢిల్లీలో మీడియాతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:** ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన మమ్మల్ని చూసి బిఆర్ఎస్, బిజెపి ఓర్వలేక ప్రతిరోజు విషం కక్కుతున్నారని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. గురువారం న్యూఢిల్లీలో ఎంపిలతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ అనంతరం మీడియాతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణ అధిష్టానం పరిధిలో ఉందని మీడియాతో అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కెటిఆర్ ఫాం హౌస్‌లో పడుకొన్నాడు మేం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. కెటిఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారంతో ప్రతిరోజు విషం కక్కుతున్నారని ఆయన ఆవేదన చెందారు. రాహుల్‌గాంధికి కెటిఆర్ ఉత్తరం రాసేదేంది అని ఆయన ప్రశ్నించారు. రాహుల్‌గాంధికి కెటిఆర్ ఉత్తరం రాయడం హాస్యాస్పదం అని ఆయన అన్నారు. రాహుల్ రాష్ట్రంలో జరుగుతున్న స్పష్టన్నీ తెలుసు అని ఆయన అన్నారు. అప్పుల కోసమే ప్రతినెల ఎంతో ఖర్చుపెట్టాల్సి వస్తున్నది అని ఆయన అన్నారు. ప్రతినెల ఒకటోతేదీనే జీతాలు వచ్చేలా చేస్తున్నా చిత్తశుద్ధితో పరిపాలన అందిస్తున్నాము అని ఆయన అన్నారు. అపోజిషన్ లీడర్‌గా ఉండి అసెంబ్లీకి రాని దద్దమ్మలు మాకు సుద్దులు చెప్పడమా అని ఆయన అన్నారు. ఎవరు గొప్పో తెల్వుకోలేక వాళ్లకి నిద్రపట్టటలేదని ఇంట్లో పంచాయతీల్లో ఎవరు గొప్పని తెల్చుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచిచేయడంకోసం ప్రజాపాలన చేస్తున్నదని ఆయన అన్నారు. మంచిపనులు చేస్తాం మళ్లీమళ్లీ గెలుస్తాం ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రజలు 50శాతానికి పైగా సంతృప్తితో ఉన్నారని మా పాలనకు ఢోకాలేదని ఆయన అన్నారు.

## రూ. పది లక్షలలోపు ఉద్యోగుల పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలి

### సిఎం సలహాదారు నరేందర్‌రెడ్డికి ఉద్యోగుల జెఏసి వినతిపత్రం

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థిక శాఖలోని ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు జెఏసి చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. 2022 23 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కుబేర్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన దృష్టికి జెఏసి ప్రతినిధులు తీసుకెళ్లారు. వేతన బిల్లులు మినహా మిగతా బిల్లులు ట్రెజరీ, అకౌంట్స్ కార్యాలయాల ఆమోదం లభించినప్పటికీ ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. జీపీఎఫ్, లీవ్ శాలరీ, సరెండర్ లీవ్, సప్లిమెంటరీ, ఏరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ అద్దె వాహనాల చార్జీలు, ఎన్నికల సంబంధిత బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లుల కారణంగా ఉద్యోగ ఉపాధ్యాయులు, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రాములు పాల్గొన్నారు.




## దేశవ్యాప్తంగా 19చోట్ల ఎన్ఐఎ దాడులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** నిషేధిత పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జైష్ఎ ముహ్మద్‌పై జాతీయ దర్యాప్తుసంస్థ ఉక్కుపాదం మోపింది. దేశవ్యాప్తంగా ఉగ్రవాదానికి మద్దతుగాప్రచారానికి పాల్పడుతున్నారని అస్సాం, గుజరాత్, జమ్ముకాష్మీర్; మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలోని 19 చోట్ల ఏకకాలంలో దాడులునిర్వహించారు. జమ్ముకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లోని బామ్‌జూ మట్టన్‌ప్రాంతం, బారాముల్లాలోని క్రీరీ బుద్గామ్‌లోని ఖాన్ సాహిబ్ ప్రాంతాల్లో ఎన్ఐఎ సోదాలునిర్వహించింది. మరోవైపు గుజరాత్‌లోని అహ్మదాబాద్ రూరల్‌పోలీసులు సహకారంతో ఎన్ఐఎ అధికారులు సనంద పట్టణంలోని ఆన్‌లైన్ రాడికల్‌సంస్థకు చెందిన అదిత్ వేపారి ఇంట్లోసోదాలు చేసింది. ఈతడు బనస్‌కాంథా జిల్లాకు చెందిన చెఖాలగ్రామంలోని మదర్‌సాలోపనిచేస్తున్నట్లు తేలింది. మహారాష్ట్రలోని భివాండి అమరావతిలో కూడా దాడులునిర్వహించారు. భివాండీలోని ఖాడీపూర్‌లోని ఒక ఇంట్లోకూడా ఎన్ఐఎ సోదాలుజరిగాయి. ఈ దాడుల్లో కమ్రాన్ అన్సారీ అనే వ్యక్తిని అరెస్టుచేసింది. అన్సారి దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తేలింది. అమరావతిలోని ఛాయానగర్‌ప్రాంతంలో 35 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకుంది. పాకిస్తాన్‌కి చెందిన ఇస్లామిస్ట్ సంస్థలతో ఆతడు సంప్రదింపులు జరుపుతున్నట్లుగా అధికారులు తెలిపారు.

## జనవరి 27న 'వెయ్యిగొంతులు.. లక్ష డప్పులు'

### ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగ దండోరా ప్రదర్శన

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:** వర్గీకరణ జరిగితే విజయోత్సవ డప్పు లేదంటే అడ్డుకునే వాళ్లకు చావు డప్పే ఉంటుందని ఎస్సీ వర్గీకరణ కోసం వెయ్యి గొంతుకలు లక్ష డప్పులతో మాదిగ దండోరా ప్రదర్శనను జనవరి 27న నిర్వహిస్తామని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ కళాకారులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ఇది ఎస్సీ వర్గీకరణ సాధనలో అంతిమ పోరాటం అని ఈ ప్రదర్శనకు మాదిగ కళాకారులు, కవులు, రచయితలే నాయకత్వం వహిస్తారన్నారు. దీనికి ఎస్సీ వర్గీకరణ కోరుకునేవారు, మద్దతిచ్చే శక్తులను భాగస్వాములు చేచడయంతోపాటు అన్ని వర్గాల కళాకారులను ఆహ్వానిస్తామన్నారు. ఈ కార్యక్రమం సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న నిలువెత్తు అంబెడ్కర్ విగ్రహం నుండి ప్రారంభమై నెక్లెస్ రోడ్ మీదుగా బయలుదేరి సంజీవయ్య పార్క్ ,ట్యాంక్ బండ్ మీదుగా లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు.

## పశువైద్య కళాశాల భవనానికి ఆర్అండ్‌బితో ఒప్పందం

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని కోడంగల్ లో కొత్తగా ఏర్పాటవుతున్న పశు వైద్య కళాశాల భవనాల నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖతో ఒప్పందం కుదిరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో పశువైద్య శాఖ, రోడ్లు, భవనాల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు పరస్పరం ఇందుకు సంబంధించిన ఎంఒయును మార్చుకున్నారు. ఈ కొత్త పశు వైద్య కళాశాల ప్రాంగణంలో ప్రధాన భవనం, పశు వైద్యశాల, బాలికల, బాలుర వసతి గృహం, ఇతర భవనాలు నిర్మించనున్నారు. మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 171 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ భవనాలు నిర్మించనున్నట్లు పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విశ్వవిద్యాలయ ఉప కులపతి. సబ్యసాచి ఘోష్ తెలియజేశారు.

# కొమురెల్లి మల్లన్న జాతరను వైభవంగా నిర్వహించాలి

### సిద్దిపేట జిల్లా అధికారులతో

### మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** కొమురెల్లి మల్లికార్జునస్వామి జాతరను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. గురువారం తెలంగాణ సచివాలయంలోని దేవాదాయ మంత్రిత్వ శాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సిద్దిపేట జిల్లా అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా మాట్లాడుతూ జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా పటిష్టమైన కార్యాచరణతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లన్న కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 29న కల్యాణం, జనవరి 19 నుంచి మార్చి 23 వరకు జాతరను నిర్వ హించేందుకు నిర్ణయించినట్లు వెల్ల డించారు. పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసి, పంచాయతీరాజ్, గ్రామీ ణా భివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్అండ్‌బి తదితర శాఖలు సమ న్వయంతో పని చేయా లనీ, భక్తులు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కల్యా ణాన్ని వీక్షించి స్వామి అమ్మవార్లను దర్శిం చుకుని తిరుగు ప్రయాణ మయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గత సంవత్సరం అనుభ వాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఈవోను ఆదేశించారు. అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనులపై మంత్రి ఆరా తీశారు. రూ.9.776 కోట్ల ఎస్డిఎఫ్ నిధులు, రూ.36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో మంత్రికి వివరించారు. ప్రతీ రోజు స్వామి వారికి అలంకరించే పూలను తదనంతరం పడేయకుండా అగర్‌బత్తులుగా తయారు చేసే సాంకేతికతను వాడుకుని దేవాలయ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, ఎల్లమ్మ దేవాలయంలో మొక్కులు సమర్పించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలనీ సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కల్యాణంతో పాటు జాతర జరిగినన్ని రోజులు దేవాలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మల్లికార్జున స్వామి కల్యాణోత్సవానికి రావాల్సిందిగా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆహ్వానించనున్నట్లు మంత్రి సురేఖ వెల్లడించారు.

# హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసల విస్తరణకు అనుమతి కోరిన సిఎం

### పలు ప్రాజెక్టులకు త్వరగా నిధులు విడుదల చేయాలని

### కేంద్రమంత్రి గడ్కరీకి వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు12:** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాత్రి సమావేశమయ్యారు. 2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161ఏఏ జాతీయ రహదారిగా ప్రకటించారని సీఎం గుర్తు చేశారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్.హెచ్ 765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు 2024 25 బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్ 65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. ఈ రహదారి విస్తరణ పనుల పూర్తయితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రి గడ్కరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్ 63 (16) వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని.. ఈ రహదారిని నగరం వెలుపల నుంచి నాలుగు చోట్ల కలుపుతూ బైపాస్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. పర్వత్‌మాల ప్రాజెక్ట్ లో యాదాద్రి దేవాలయం, నల్గొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో.. ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, నల్గొండ జిల్లాల్లో ఎన్.హెచ్65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్ పోర్ట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలలని గడ్కరీకి సిఎం విజ్ఞప్తి చేశారు.

## మసీదుల సర్వేలకు 'సుప్రీం' బ్రేక్

### దిగువకోర్టులు కొత్తకేసులు తీసుకోరాదు

### చీఫ్‌జస్టిస్ ఆధ్వర్యంలోని సుప్రీం బెంచ్ ఆదేశాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** దేశంలోని వివిధ మసీదులు, ఇతర ప్రార్థనా మందిరాల్లో జరుగుతున్న సర్వేలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. సుప్రీంలో దాఖలయిన వివిధ ప్రార్థనా మందిరాల్లో ఆరాధనకు సంబంధించిన చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలయిన పిటిషన్లను గురువారం నుంచి విచారణప్రారంభించింది. ఈ క్రమంలోనే ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను నిలిపివేయాలని ఆదేశాలిచ్చింది. మొత్తం ఆరు పిటిషన్లు కోర్టు ముందుకు వచ్చాయి. బిజెపికి చెందిన సుబ్రహ్మణి యన్‌స్వామి పిటిషన్ కూడా వీటిలో ఉంది. నాలుగేళ్లక్రితమే ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రభుత్వం స్పందించాలనికోరితే ఇప్పటివరకూ ఈ పిటిషన్లపై ప్రభుత్వం స్పందించలేదని సుప్రీం అభిప్రాయపడింది. ఇక మరోవైపు ఈ పిటిషన్లు ప్రార్థనామందిరాల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరాయి. 1947 ఆగస్టుకు ముందు ఉన్న ఆకృతుల్లో మార్పులు, లేదా ప్రార్థనాస్థలం స్థానంలో మరొక ప్రార్థనా స్థలం ఏర్పాటు వంటివాటిని నిషేధించేందుకు ఈచట్టం అమలవుతున్నది. శరద్‌పవార్‌గ్రూప్ ఎన్సీపీ ఎంపి జితేంద్ర అవధ్, ఆర్జేడి ఎంపి మనోజ్‌కుమార్‌ఝా, తమిళనాడు డిఎంకె పార్టీలు దాఖలుచేసిన పిటిషన్లు కూడా ఉన్నాయి. హిందూ దేవాలయాలను కూల్చివేసి మసీదులు నిర్మించారన్న వాదనలతో కోర్టుల్లో పిటిషన్ల వేసి కోర్టు ఆదేశాలతో మసీదులు సర్వేలుచేస్తుండటంతో ఇపుడు ప్రతిచోటా కూడా ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా సుప్రీంకోర్టు దిగువ కోర్టులకు సైతం స్పష్టమైన మార్గదర్శకాలుజారీచేస్తూ ఇటువంటి పిటిషన్లపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని, కొత్తకేసులు విచారించవద్దని కూడా ఆదేశాలిచ్చింది. చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కెవివిశ్వనాథన్‌లతోకూడిన బెంచ్ ఈ ఆదేశాలు జారీచేయడంతో ఇపుడు ఎక్కడికక్కడ సర్వేలన్నీ నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం తన స్పందనను తెలియజేసేంతవరకూ ఈ పిటిషన్లపై నిర్ణయం ప్రకటించబోమని సుప్రీం బెంచ్ స్పష్టంచేసింది.

# ఎఐసిసి ఇన్‌చార్జ్‌లపై పెరుగుతున్న అసంతృప్తి

### కాంగ్రెస్‌పార్టీని చంపేస్తారా? ఆగ్రహంతో ఊగిపోయిన జగ్గారెడ్డి

### మెదక్ జిల్లా ఇన్‌చార్జినని కూడా మరిచిపోవద్దన్న ఎఐసిసి కార్యదర్శి విష్ణు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఏఐసిసి ఇంచార్జీలపై తెలంగాణలో నానాటికి అసంతృప్తి పెరుగుతోన్నది. తెలంగాణలో అధికారంలోకి రాగానే సీనియర్లను పక్కనబెట్టి కనీసం సమాచారం ఇవ్వకుండా కొత్తవారిని తెరపైకి తీసుకొని రావడం ఏఐసిసి ఇంచార్జీలు ఈ విషయంలో కలుగచేసుకొని పదేళ్ళ ప్రతిపక్షంలో ఎంతో ఇబ్బందులు ఎదర్కొంటూ జెండా పట్టుకొన్న కార్యకర్తలకు న్యాయం చేయడంలేదని అసహనం ఏదో ఒక రూపంలో ఎప్పడో అపుడు బయట పడుతూనే ఉంది. తాజాగా బుధవారం రాత్రి ఒక ఫంక్షన్‌లో టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ తూర్పుజయప్రకాష్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి ఏఐసిసి కార్యదర్శి తెలంగాణ ఇంచార్జీ విష్ణును దొరకపట్టుకొని తీవ్రం పదజాలతో ప్రశ్నించారు. మీ ఇంచార్జీలు ఇంతకు తెలంగాణలో కాంగ్రెస్‌ను బతికించాలనుకొంటున్నారా? కాంగ్రెస్‌ను చంపేస్తారా అని మాటల దాడి చేశారు. ఇంతకీ మీరు ఏఐసిసి కార్యదర్శిగా ఉన్నారా ? వేరేరాష్ట్రానికి వెళ్ళిపోయారా అంటు జగ్గారెడ్డి ప్రశ్నించారు. దీనికి ఏఐసిసి కార్యదర్శి తెలంగాణ ఇంచార్జీ విష్ణు రిటార్టు ఇస్తూ మెదక్ జిల్లాకు కూడా నేనే ఇంచార్జీగా ఉన్నానే విషయం మీరు మరిచిపోయారు దురుసుగానే సమాధానం ఇచ్చారని తెలిసింది. వెంటనే జగ్గారెడ్డి పార్టీకి దీపాదాస్ మున్షీకూడా ఇంచార్జీగా ఉన్నారా అని వ్యటకార ధ్వనితో ప్రశ్నించినట్లు తెలిసింది. లేక వేరే రాష్ట్రం పోయారా అని నిలదీశారు? అధికార పార్టీ అంటే ఎలా ఉండాలి;?మీరేం చేస్తున్నారని ఆయన మండి పడ్డారి తెలిసింది. మీరు ఏం చేస్తున్నారో అర్థం అవుతుందా;? పదేళ్ల జెండాపట్టుకొని కష్టపడ్డ వారిని కాదని కొత్తగా వచ్చినవాళ్ళకు పదవులు ఇవ్వడానికి సిఫార్సులు చేస్తున్నారు వాళ్ళు ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడికిపోయేటోళ్ళను లెక్కలోకి తీసుకొంటారా కష్టకాలంలో పార్టీ జెండా పట్టుకొన్నోళ్ళకు ప్రాధాన్యత ఇస్తారా ఇలా అయితే పార్టీ చచ్చిపోతుందని జగ్గారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తంచేసినట్లు తెలిసింది. కొత్తవాళ్ళు పార్టీలకు వచ్చేది తెలియదు. వాళ్ళకు పదవులు ఫైన్ అయ్యేవరకు మాకు తెలియదు అంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల్లో గెలిచేందుకు కృషిచేసినవారిని ఎవరు పట్టించుకోవాలని ఆయన నిలదీశారు అసలు విష్ణుగారు మీరు ఏఐసిసి కార్యదర్శిగా ఉన్నారా తెలంగాణ కాకుండా వేరే రాష్ట్రం ఇంచార్జీగా వెళ్ళిపోయారా అని ఆయన పదేపదే ప్రశ్నించడం జరిగింది...కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవులు ఇతర పార్టీ పదవులు ఇవ్వడంలో కొత్తవారికి ఇవ్వడం జగ్గారెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది ఆయన బహిరంగా చెప్పకపోయినా అంతర్గత సమావేశాలలో ఈ విషయం ప్రస్తావిస్తూ వస్తున్నారు.

# చీడపీడల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

### రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

### వ్యవసాయ వర్సిటీలో ప్రారంభమైన జాతీయ సదస్సులు



సదస్సుకు హాజరైన రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, శాస్త్రవేత్తలు

**హైదరాబాద్ (అత్తాపూర్) డిసెంబరు 12, ప్రభాతవార్త :** వాతావరణం మార్పు లకనుగుణంగా పంటల్లో సోకే చీడపీడల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపా ధ్యక్షుడు జి.చిన్నారెడ్డి శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ పాథాలజీ అండ్ ఇన్నోవేటివ్ అప్రోచెస్ ఇన్ ప్లాంట్ డిసీజ్ మేనేజ్‌మెంట్(ఆర్ఎపిపిఐడి)' అంశంపై రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులు జరగనున్న సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఫైటో పాథలాజికల్ సొసైటీ (సెంట్రల్‌జోన్), దక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ ఫాథాలజీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కృత్రిమమేధ, మిషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలను సస్యరక్షణలో వినియోగించుకోవాలని సూచించారు. ఆహార, పోషణ, భద్రత కల్పించడంలోనూ వ్యవ సాయ శాస్త్ర వేత్తలు కృషి జరపాలన్నారు. ప్లాంట్ పాథాలజిస్ట్ లే మొక్కల డాక్టర్లని ఆయన కొనియాడారు. తాడేపల్లి గూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ గోపాల్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి, గుంటూరు లాం లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి శారదా జయలక్ష్మి ప్రసంగించారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సత్య నారాయణ ప్రసంగించారు. ప్లాంట్ పాథాలజీ రంగంలో చేపట్టాల్సిన పరిశోధనలు వాటి అవసరాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 150 మంది ప్లాంట్ పాథాలజీ విభాగం శాస్త్రవేత్తలు, శిబి, విద్యార్థులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## 14 నుండి ప్రారంభం కానున్న సంతోష్ ట్రోఫీ

### పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** ఈనెల 14 నుండి హైదరాబాద్ నగరంలో ప్రారంభం కానున్న సంతోష్ ట్రోఫీ పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు.స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీ, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు జితేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 57 సంవత్సరాల తర్వాత హైదరాబాద్ నగరం చారిత్రాత్మకమైన ఫుట్ బాల్ క్రీడా ప్రతిష్టాత్మక టోర్నీ సంతోష్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరమైన విషయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డిసెంబర్ 14 నుండి డిసెంబర్ 31 వరకు దాదాపు 37 వివిధ రాష్ట్రాల జట్లు పాల్గొంటున్న ఈ సంతోష్ ట్రోఫీకి సంబంధించి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు.

## గురుకులాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

### బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరాలని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఒకనప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట గురుకులాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా విద్యార్థులు ఉండడానికి కనీస సౌకర్యాలు లేకపోవడం, రకరకాల ఇబ్బందులు జరగడం దానివల్ల విద్యార్థుల చనిపోవడం అనేక రకమైన ఇబ్బందులతో హాస్పిటల్లో చేరడం జరుగుతుందన్నారు. వివిధ సంఘాలు రాజకీయ పార్టీ నాయకులు సందర్శించి అక్కడి ఇబ్బందులను ప్రభుత్వానికి, ప్రజల దృష్టికి గురుకులాలలో జరుగుతున్న లోపాలను జరుగుతున్న సంఘటనలు బయట తెలియజేయడంతో ప్రభుత్వం భయపడుతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కూడా తెలియడంతో ప్రభుత్వము గురుకులాల్లో జరుగుతున్న సంఘటనను ఏ విధంగా చక్కదిద్దాలని ఆలోచన మానేసి అక్కడ జరుగుతున్న విషయాలు మీడియా తెలియకూడదు అని ఉద్దేశంతో గురుకులాలలో రాజకీయ పార్టీ గాని స్వచ్ఛంద సంస్థలు గాని ప్రవేశించకూడదని బ్యానర్లు పెట్టి చట్టరీత్యా చర్య తీసుకుంటామని హెచ్చరించడం ఈ కాంగ్రెస్ నిరంకుశ ప్రభుత్వ వైఖరి తేటతెల్లమవుతుందన్నారు. ఇప్పటికైనా గురుకులాల పరిస్థితి చక్క దిద్దడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి పిల్లల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. గురుకులాలలో సౌకర్యాలని మెరుగుపరచక పరిస్థితి ఇలాగే ఉంటే రాష్ట్రంలో ఉన్న అన్ని గురుకులాల ముందు బిజెపి ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు మృతి

**పెద్దవూర ప్రభాతవార్త. డిసెంబరు 12:** కట్టెల లోడుతో రోడ్డుపై వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీని బైక్ తో ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన నల్గొండ జిల్లా పెద్దవూర మండలం సిరిసిల్ల గండ్ల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పెద్దవూర ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని బసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన తుడుం లింగయ్య (40) దారం రమేష్ అనే ఇద్దరు వ్యక్తులు కొత్తలూరు వైపు నుంచి సిరిసిల్ల గ్రామం వైపు వస్తున్నారు. అదే సమయంలో పెద్దగూడెం వైపు నుంచి కొత్తలూరు వైపు నువ్వుల కట్టలోడుతో ట్రాక్టర్ వెళ్తుంది. ఈ క్రమంలో ట్రాక్టర్ సైడ్ డోర్ తెరిచి ర్యాలీ బయటికి వచ్చే విధంగా కట్టెలు కట్టడంతో ఎదురుగా వస్తున్న బైకు కు ట్రాక్టర్ లోడ్ కనపడకపోవడంతో ఎదురుగా ఢీకొట్టింది దీంతో బైక్ పై ఉన్న ఇద్దరు తలలు పగిలి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని లింగయ్య రమేష్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమల నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణ మైన ట్రాక్టర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై వీరబాబు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆ ప్రతిపాదనకు 2017లోనే మద్దతు ఇచ్చాం

### వన్ నేషన్... వన్ ఎలక్షన్ ప్రతిపాదనపై మాజీమంత్రి కెటిఆర్ స్పందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు12:** ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును తీసుకొచ్చేందుకు కేంద్రం సన్నద్ధమైంది. ఈ మేరకు గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం దక్కింది. తాజాగా జరుగుతున్న శీతాకాల సమావేశాల్లోనే ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పందించారు. ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని 2017లోనే ప్రతిపాదన చేశారని, ఆ సమయంలో ప్రధాని మోదీ.. అఖిల పక్ష సమావేశం నిర్వహించారని, ఆ సమావేశానికి హాజరై ఆ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చినట్లు కేటీఆర్ గుర్తు చేశారు. మళ్లీ ఏడేళ్ల తర్వాత ఇప్పుడు వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రతిపాదన వచ్చిందని, దీనికి క్యాబినెట్ ఆమోదం దక్కినట్లు తెలుస్తోందని, అయితే ఆ బిల్లు ఏ రూపంలో ఉందన్న అంశంపై క్లారిటీ లేదని కేటీఆర్ అన్నారు.



## కులాల పేరు మార్పుపై బిసి కమిషన్ విచారణ

### విజ్ఞప్తులను స్వీకరించిన కమిషన్

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కొన్ని కులాలు తమ కులం పేరును అధికారికంగా మార్చి అభ్యంతరకంగా లేకుండా .. తమకు అనుకూలంగా ఉండేలాగా చూడాలని ఆయా కులాల ప్రతినిధులు బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో అలా విజ్ఞప్తులు చేసిన కుల సంఘాల ప్రతినిధులు, నాయకులతో తెలంగాణ బీసీ కమిషన్ గురువారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో విచారణ జరిపి.. వారి అభిప్రాయాలను సేకరించింది. బీసీ కమిషన్ ఉమ్మడి 10 జిల్లాల్లోనూ అలాగే బీసీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణలో.. కులాల పేరు మార్పుపై విజ్ఞప్తి చేసిన కులాల ప్రతినిధులతో గురువారం కమిషన్ చర్చించింది. ఆయా కుల సంఘాల నేతలు వారు మార్పు కోరిన కులం ఇతర ప్రతిపాదనలు వారి నుండి అభిప్రాయాలు తీసుకుని బీసీ కమిషన్ వాటిని రికార్డ్ చేసింది. అందులో భాగంగా దొమ్మర, వంశరాజ్ మరియు తమ్మలి కుల సంఘాల ప్రతినిధులు హాజరై తమ కులాల యొక్క స్థితిగతుల గురించి కమిషన్‌కు వివరిస్తూ తమ పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేశారు.



## బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్‌లో గాయత్రి, ట్రెసా ఓటమి

**ఢిల్లీ:** బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో తొలిసారి, పోటీ పడుతున్న భారత జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ తొలి మ్యాచ్‌లోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రపంచ నంబర్ వన్, చైనాకు చెందిన జంట లియు షెంగ్ షు-టాన్ నింగ్‌తో జరిగిన గ్రూప్ ఎ తొలి లీగ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 22-20, 20-22, 14-21తో పోరాడినా ఫలితం దక్కక ఓటమిపాలైంది. 82 నిమిషాల సుదీర్ఘ పోరులో గాయత్రి-ట్రెసా వరల్డ్ నంబర్ వన్ జోడీకి గట్టి పోటీనే ఇచ్చారు. తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న భారత జంట, రెండో గేమ్‌లో 14-18తో వెనుకబడింది. ఈ దశలో వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి స్కోరును 18-18తో సమం చేసింది. ఆ తర్వాత చైనా జోడీ రెండు పాయింట్లు గెలవగా, ఆ వెంటనే భారత్ జంట కూడా రెండు పాయింట్లు సాధించింది. దాంతో స్కోరు మళ్లీ 20-20తో సమమైంది. ఈ దశలో చైనా జోడీ రెండు పాయింట్లు గెలిచి గేమును దక్కించుకుని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో చైనా జోడీ తమ అనుభవాన్నంతా రంగరించి పోరాడి గట్టెక్కింది.



## స్మృతి ఖాతాలో మరో రికార్డు

**ఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధన ఖాతాలో మరో రికార్డు వచ్చి చేరింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో సూపర్ సెంచరీతో మెరిసిన మంధన, ఓ క్యాలెండర్ ఇయర్లో నాలుగు వన్డే సెంచరీలు చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డుల్లో కెక్కింది. ఈ ఘనత సాధించే క్రమంలో మంధన మరో రికార్డు కూడా తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్లో 8000 పరు గులు పూర్తి చేసుకున్న అతి పిన్న వయస్కురాలుగా (28 ఏళ్ల 146 రోజులు) రికార్డు నెలకొల్పింది. మంధన వన్డేల్లో 3812 పరుగులు, టీ20ల్లో 3568 పరుగులు, టీ20ల్లో 629 పరుగులు చేసింది. ఆస్ట్రేలియాతో మూడో వన్డే విషయానికొస్తే ఈ మ్యాచ్‌లో మంధన సెంచరీతో (109 బంతుల్లో 14 ఫోర్లు, సిక్సర్ సాయంతో 105 పరుగులు) కదం తొక్కినప్పటికీ టీమిండియా 83 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

# భారత్ పాయింట్ల టెన్షన్

### రెండు స్థానాలకై టీమ్‌ల హోరాహోరీ పోరు

### ఆశలన్నీ వరల్డ్ టెస్టు ఛాంపియన్ ఫైనల్‌పైనే



**ఢిల్లీ:** మ్యాచ్‌లు జరుగుతున్న కొద్దీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక ఉత్కంఠ భరితంగా మారుతోంది. మొదటి రెండు స్థానాల కోసం వివిధ జట్ల మధ్య హోరాహోరీ పోరు గట్టిగా కొనసాగుతోంది. బోర్డర్ గావస్కర్ ట్రోఫీని ఘనంగా ప్రారంభించిన టీమిండియా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టాప్ 1లోకి వెళ్లింది. అయితే ఆస్ట్రేలియాతో జరుగుతున్న పింక్ బాల్ టెస్టులో మాత్రం ఘోర పరాజయాన్ని అందుకోవడంతో మూడో స్థానానికి టీమిండియా పడిపోవాల్సి వచ్చింది. ఇంకా మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్న నేపథ్యంలో టీమ్ ఇండియా అగ్రస్థానంలోకి చేరడానికి ఇంకా అవకాశాలు సజీవంగానే ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరగబోయే మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ టీమ్ ఇండియా గెలుపొందాలి. అప్పుడు 64.04 శాతంతో టీమ్ ఇండియా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ముందుకెళ్తుంది. ఇదే సమయంలో ఆస్ట్రేలియా 55.26 శాతం కన్నా ఎక్కువ సాధించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో అగ్రస్థానం కోసం భారత జట్టుకు పోటీ దక్షిణాఫ్రికా మాత్రమే బరిలో ఉండే వీలుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టు 63.33 శాతంతో నెం.1 స్థానంలో కొనసాగుతోంది. ఇక దక్షిణాఫ్రికా తన తదుపరి రెండు మ్యాచ్‌లను పాకిస్థాన్‌తో తలపడనుంది. ఈ సిరీస్‌ను 11తో ముగిస్తే, ఆ జట్టు ఖాతాలో 61.11 శాతం పాయింట్లు ఉంటాయి. ఒక వేళ దక్షిణాఫ్రికా 20 తేడాతో పాకిస్థాన్‌ను ఓడిస్తే, భారత జట్టుకు మాత్రం అగ్రస్థానం దక్కే అవకాశాలు సన్నగిల్లుతాయి. దీంతో 69.44 శాతంతో దక్షిణాఫ్రికా అగ్రస్థానంలోకి వెళ్తుంది. దక్షిణాఫ్రికా 10 తేడాతో సిరీస్‌ను ముగించినా కూడా, వారి ఖాతాలో 63.89 పర్సంటేజీ మాత్రమే వస్తుంది. ఇదే సమయంలో ఆస్ట్రేలియాపై మూడు టెస్టుల్లో గెలిస్తే టీమ్ ఇండియాకు 64.04 శాతం దక్కుతుంది. దీంతో భారత జట్టే అగ్రస్థానంలోకి వస్తుంది. ఒకవేళ దక్షిణాఫ్రికా రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోతే మాత్రం 52.78 శాతానికి పడిపోయి, ఆస్ట్రేలియా జట్టు టాప్ 2లోకి వెళ్తుంది. అప్పుడు మళ్లీ టీమ్ ఇండియా, ఆస్ట్రేలియా మధ్యే తుది పోరు చూసే అవకాశం ఉంటుంది. మొత్తంగా ఆస్ట్రేలియాతో జరిగే మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తేనే టీమ్ ఇండియాకు అవకాశాలు ఉంటాయి. లేకపోతే తుది పోరు చేరడానికి ఇతర జట్ల రిజల్ట్స్‌పై టీమిండియా ఆధారపడాల్సి ఉంటుంది.

ఆట



### ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా

# గుకేశ్ రికార్డు

**ఢిల్లీ:** 18 ఏళ్ళ యువతేజం, చెస్ ఛాంపియన్ గుకేశ్ రికార్డ్ సృష్టించారు. అతి పిన్న వయసులో ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ విజేతగా నిలిచారు. చివరి 14వ గేమ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా డింగ్ లిరెన్‌పై గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌తో గురువారం జరిగిన పోరులో విజేతగా నిలిచాడు. ఈ చివరి ఆట ఆద్యాంతం నువ్వా, నేనా అన్నట్లుగా సాగింది. చివరికి విజయం గుకేశ్‌నే వరించింది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్న రెండో భారత ఆటగాడిగా గుకేశ్ చరిత్ర సృష్టించాడు. కాగా చివరి 14వ గేమ్‌లో ఎవరు విజేత అనేది ఇరువురి మధ్య పోరు తీవ్ర ఉత్కంఠంగా సాగింది. సుమారు 5 గంటలపాటు సాగిన 13వ రౌండ్‌లో ప్రత్యర్థులిద్దరూ పాయింట్‌ను పంచుకున్నారు. విజయం కోసం గుకేశ్ గట్టిగానే ప్రయత్నించినా, ప్రశాంతంగా ఆడిన 32 ఏళ్ల లిరెన్ ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో 68 ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్ల ఫలితం తేలకుండానే గేమ్ ముగించేందుకు అంగీకరించారు. ఇవాళ జరిగిన 14వ రౌండ్‌లో విజయంతో ఒక పాయింట్ సాధించిన గుకేశ్ విజేతగా నిలిచాడు. ఈటోర్నీలో గుకేశ్ మొదటి నుంచి పెద్ద పెద్ద ఆటగాళ్ళను తోసిరాజనుకుంటూ వచ్చాడు. నెపోమ్నియాషి, కరువానా, నకముర వంటి మేటి గ్రాండ్‌మాస్టర్స్‌పై విజయం సాధించాడు. చెస్ ఒలింపియాడ్‌లో భారత్ గ్రాండ్ విక్టరీ కొట్టడంలో కూడా గుకేశ్ కీలక పాత్ర పోషించాడు.

### ప్రో కబడ్డీలో.. ప్లే ఆఫ్స్‌కు

# హర్యానా



### 37-26 పాయింట్ల తేడాతో బెంగళూరు చిత్తు

**ఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)-2024, సీజను 11లో ప్లే ఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా హరియాణా స్టీలర్స్ నిలిచింది. పూణేలో జరిగిన పోరులో హరియాణా స్టీలర్స్ 37-26 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసి ప్లే ఆఫ్స్ బెర్తును అధికారికంగా ఖరారు చేసుకుంది. తాజా సీజన్లో ఇప్పటివరకు 19 మ్యాచ్‌లు ఆడిన హరియాణా 15 విజయాలు, 4 పరాజయాలతో 77 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఇదే సమయంలో ఈ టోర్నమెంట్ ప్లే ఆఫ్స్‌లో చోటు ఖాయం చేసుకుంది. ఏకపక్షంగా సాగిన పోరులో హరియాణా స్టీలర్స్ ఆధిపత్యం కనపరచింది. హరియాణా తరపున వినయ్ 9 పాయింట్లు, శివమ్ 8 పాయింట్లతో సత్తా చాటగా, మొహమ్మద్ రెజా 6 పాయింట్లు సాధించాడు. బెంగుళూరు బుల్స్ తరపున జతిన్ 5 పాయింట్లుతో కొద్దిసేపు పోరాడాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 21 రెయిడ్ పాయింట్లు సాధించగా, బెంగళూరు 14 రెయిడ్ పాయింట్లకే పరిమితమైంది. మరోవైపు ఈ సీజన్లో 18 మ్యాచ్‌లు ఆడి కేవలం 2 విజయాలు, 15 పరాజయాలు, ఒక టైతో 19 పాయింట్లతో ఉన్న బెంగళూరు బుల్స్ పట్టిక అట్టడుగున 12వ స్థానంలో కొనసాగుతోంది. కాగా మరో మ్యాచ్‌లో యు ముంబా 47-31 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది.

## టి20లో అఫ్ఘాన్‌పై జింబాబ్వే విజయం





**ఢిల్లీ:** మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో జింబాబ్వే గెలుపొందింది. ఈ మ్యాచ్ చివరి బంతి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగింది. చివరి బంతికి ఒక్క పరుగు చేయల్సి ఉండగా తషింగ సింగిల్ తీసి జింబాబ్వేను గెలిపించాడు. ఆఖరి ఓవర్లో జింబాబ్వే 11 పరుగులు రాబట్టి గెలుపు తీరాలకు చేరింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు మాత్రమే చేయగలిగింది. 58 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆఫ్ఘనిస్తాన్ కరీమ్ జనత్ 54 పరుగులతో నాటౌట్‌గాను, మహ్మద్ నబీ 44 పరుగులు చేసి ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 79 పరుగులు జోడించి తమ జట్టుకు గౌరవప్రదప్రమైన స్కోర్ అందించారు. జింబాబ్వే బౌలర్లలో నగరవ 3 వికెట్లు పడగొట్టగా, ముజరబానీ, ట్రెవర్ గ్వాండు, మసకద్జ తలో వికెట్ పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన జింబాబ్వే ఆదిలో సునాయాసంగా గెలిచేలా కనిపించింది. అయితే మధ్యలో ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పాటు, వికెట్లు తీసి జింబాబ్వేపై ఒత్తిడి పెంచారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ 49 పరుగులతె జింబాబ్వేను గెలుపు వాకిటి వరకు తీసుకొచ్చి ఔటయ్యాడు. ఇక్కడే ఆఫ్ఘన్లు జింబాబ్వేపై ఒత్తిడి పెంచారు. 11 పరుగుల వ్యవధిలో జింబాబ్వే రెండు వికెట్లు కోల్పోయి గెలుపు కోసం చివరి బంతి వరకు ఎదురు చూడాల్సి వచ్చింది. ఎట్టకేలకు తషింగ 16 పరుగులతో నాటౌట్‌గాను, మసకద్జ 6 పరుగులతో నాటౌట్‌గా సాయం అందించి జింబాబ్వేను విజయతీరాలకు చేర్చాడు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో నవీన్ ఉల్ హక్ 4-1-33-3, రషీద్ ఖాన్ 4-0-26-2తో అద్భుతంగా బౌలింగ్ చేశారు. మహ్మద్ నబీకి ఓ వికెట్ దక్కింది. కాగా ఈ ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఈ నెల 13న జరుగనుంది.

# మొండి బకాయిలు రూ.3 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల మొండి బకాయిలు (ఎన్పీఏలు) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం త్రైమాసికం (సెప్టెంబర్ 30) ముగిసి రూ.3,16,331 కోట్లుగా నమోదయినట్లు ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్య సభకు తెలిపారు. మొత్తం రుణాల్లో ఇది 3.09శాతమని వివరించారు. ప్రైవేటు రంగ బ్యాంకుల విషయంలో ఎన్పీఏలు రూ.1,34,339 కోట్లు మొత్తం రుణాల్లో ఇది 1.86 శాతంగా వివరించబడింది. ఇంకా ఆయన అంశాల్లో ముఖ్యమైనవి 2024 మార్చి 31 నాటికి 580 మంది ప్రత్యేక రుణగ్రహీతలు (వ్యక్తులు,విదేశీరుణగ్రహీతలు మినహా), ఒక్కొక్కరు రూ.50కోట్ల కంటే ఎక్కువ రుణ బకాయిలను కలిగి ఉన్నారు. వీరిని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా వర్గీకరించాయి. మొత్తం 1,963 సీఐఆర్పీ (కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్)



కేసులు కొనసాగుతున్నాయి. వాటిలో 1,388కేసులు నిర్దేశిత(కేసుల పరిష్కారానికి) 270 రోజుల కాల పరిమితిని మించిపోయాయి. ఈ యేడాది సెప్టెంబరు వరకు దివాలా చట్టం కింద 1,068 కేసుల పరిష్కారం అయ్యాయి. తద్వారా బ్యాంకింగ్ సుమారు రూ.3.55 లక్షలకోట్లను రికవరీ చేసింది. బ్యాంకులతో సహా రుణదాతల మొత్తం క్లెయిమ్ రూ.11.45 లక్షల కోట్లు కాగా, మొత్తం లిక్విడేషన్ విలువ రూ.2.21 లక్షల కోట్లు.

# పెరుగుతున్న ఇంధన పునరుత్పాదక శక్తి

**న్యూఢిల్లీ, డిసెంబరు 12:** భారతదేశంలో శిలాజ రహితం ఇంధన స్థాపిత సామర్థ్యం గత యేడాది 187.05 జీడబ్ల్యూ నుండి ఇప్పుడు 213.70 జీడబ్ల్యూకు చేరుకుంది. అదనంగా పైప్లైన్ ప్రాజెక్టులతో సహా మొత్తం సామర్థ్యం 472.90 జీడబ్ల్యూకి పెరిగింది. ఇది గత సంవత్సరం 368.15 జీడబ్ల్యూ నుండి 28.5 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఈ పరిణామాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్దేశించిన పంచామృతం లక్ష్యాల ప్రకారం స్వచ్ఛ ఇంధన లక్ష్యాలను సాధించడంలో భారతదేశంలో ఇందన వృద్ధిని పెంచుతుంది. 2024 2025 ఆర్థిక సంవత్సరంలో, నవంబర్ 2024 నాటికి 14.94 జీడబ్ల్యూ కొత్త పునరుత్పాదక ఇంధన సామర్థ్యం నమోదైంది. గత సంవత్సరంలో ఇదే కాలంలో జోడించిన 7,54 జీడబ్ల్యూ కంటి దాదాపు రెట్టింపుగా ఉంది. భారతదేశ పునరుత్పాదక ఇంధన వృద్ధిలో సౌరశక్తి అగ్రగామిగా కొనసాగుతోంది. సౌర సామర్థ్యం 30.2 శాతం పెరిగింది. 2023లో 72.31 జీడబ్ల్యూ నుండి 2024లో 94.17 జీడబ్ల్యూకి పెరిగింది. పైఏన్‌లను అంచనా వేసే మొత్తం సౌర సామర్థ్యం 52.7 శాతం



పెరిగింది. 2024లో 261.15 జీడబ్ల్యూకి చేరుకుంది భారతదేశంలో పునరుత్పాదక ఇంధన పురోగతికి పవన శక్తి కూడా దోహదపడింది. పవన్ ఇంధన సామర్థ్యం 7.6 శాతం పెరిగింది. 2023లో 44,56 జిడబ్ల్యూ నుంచి 2024లో 47.96 జీడబ్ల్యూ కే పెరిగింది. పైర్‌లైన్ ప్రాజెక్టులను కలుపుకుంటే మొత్తం వైన సామర్థ్యం 17.4 శాతం పెరిగింది. 63,41 జీడబ్ల్యూ నుంచి 74,44 జీడబ్ల్యూకి పెరిగింది. బయోఎనర్జీ, జలవిద్యుత్ శక్తి అణుశక్తి వంటి ఇతర పునరుత్పా దక ఇంధన రంగాలు కూడా స్థిరమైన సహకారాన్ని అందించాయి. 4.6 శాతం పెరిగింది. 2023లో 10.84 జిడబ్ల్యూ నుండి 2024లో 11:34 జిడబ్ల్యూకి పెరిగింది. చిన్న హైడ్రో ప్రాజెక్టులు 1:39 జీడబ్ల్యూకి నుండి 5:08 జిడబ్ల్యూకి స్వల్పంగా ఎరిగి, ప్రపన్ ప్రాజెక్టులతో సహా మొత్తం సామర్థ్యం 5.54 జిడబ్ల్యూకి చేరుకుంది. స్థాపిత సామర్థం 46.88 జీడబ్ల్యూ నుంచి 46,97 జీడబ్ల్యూకి పరగడుపున పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టులు స్వల్పంగా పెరిగాయి. ప్రెన్‌లైన్ ప్రాజెక్టులతో సహా మొత్తం జలవిద్యుత్ సామర్థ్యం 8485 జిడబ్ల్యూ నుంచి 67.02 జిడబ్ల్యూకి పెరిగింది. అణుశక్తి రంగంలో భారతదేశ స్థాపిత అణు సామర్థ్య 9.4శాతం పెరిగింది. 2023లో 7.48 జిడబ్ల్యూ నుంచి 2024లో 8.18 జిడబ్ల్యూకి పెరిగింది. అయితే పైప్‌లైన్ ప్రాజెక్టులతో సహా మొత్తం అణు సామర్థ్యం 22.48 జిడబ్ల్యూ వద్ద స్థిరంగా ఉంది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, డిసెంబరు 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా, దేశీయ మార్కెట్లు మాత్రం ఒడుదుడుకులకు లోనై తర్వాత నష్టాల్లో స్థిరపడ్డాయి. ఐటి స్టాక్స్ రాణించినప్పటికీ, మిగిలిన రంగాల షేర్లలో మాత్రం స్తబ్ధత నెలకొంది. నవంబరు నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. చివరికి సెన్సెక్స్ 236.18 పాయింట్ల నష్టంతో 81,289.96 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 93.10 పాయింట్ల నష్టంతో



24,548.70పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.84.87గా ఉంది. ఎన్‌టిపిసి, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా మోటార్స్, మారుతి సుజుకి, ఎల్‌అండ్‌టి షేర్లు నష్టాల్లో ముగిసాయి. టెక్‌మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 73.68 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2747 డాలర్ల వద్ద ట్రేడయింది.

# ఉద్యోగుల కోసం ఇంటెల్ మాజీ సిఇఒ ఉపవాసం!

**ముంబై, డిసెంబరు 12:** ప్రముఖ టెక్నాలజీ కంపెనీ ఇంటెల్ ఉద్యోగుల కోసం దాని మాజీ సీఈవో పాట్ గెల్సింగర్ ఉపవాసం ఆచరిస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఉపవాసంలో తనతో చేరాలని సహోద్యోగులనూ కోరుతున్నారు. ఇంతకీ ఉపవాసం ఎందుకు చేస్తున్నారు.. ఇంటెల్ ఉద్యోగులకు ఏమైంది, ఈయన ఏం చెప్పారన్నది ఇప్పుడు చూద్దాం. ఇంటెల్ నుంచి ఉద్వాసనకు గురైన సంస్థ మాజీ సీఈవో పాట్ గెల్సింగర్ సంస్థలో పనిచేస్తున్న లక్ష మందికి పైగా



ఉద్యోగుల శ్రేయస్సు, వారి భవిష్యత్తు కోసం లోతైన ఆందోళనను వ్యక్తంచేస్తూ తాను ఆచరిస్తున్న ప్రార్థన, ఉపవాసంలో తనతో చేరాలని సహోద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. నేను ప్రతి గురువారం 24 గంటలపాటు ప్రార్థన, ఉపవాసం ఆచరిస్తున్నాను. క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటున్న లక్ష మంది ఇంటెల్, ఉద్యోగుల కోసం ప్రార్థనలు, ఉపవాసం చేయడంలో నాతో చేరాలని ఈ వారం నేను మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. ఇంటెల్, దాని సిబ్బంది పరిశ్రమకు, యూఎస్ భవిష్యత్తుకు చాలా ముఖ్యమైనది అని గెల్సింగర్ రాసుకొచ్చారు. చీఫ్‌మార్కెట్లో ఇంటెల్ ప్రతిభ తగ్గిపోవడం, మరోవైపు ఎన్విడియా పుంజు కోవడం వంటి పరిణామాల నేపథ్యంలో కంపెనీ బోర్డ్ విశ్వాసాన్ని కోల్పోయిన జెల్సింగర్ ఉద్వాసనకు కొనుగోలు చేశారు. ఇంటెల్ సంస్థను నడిపించడం తనకు లభించిన జీవితకాల గౌరవ మని తన పదవీ విరమణ సందర్భంగా గెల్సింగర్ ప్రకటించారు. ఇంటెల్లో ఇటీవల పునర్వ్యవస్థీకరణ మార్పులు సంభవించాయి. 15% సిబ్బందిని తొలగించారు. 10బిలియన్ డాలర్ల మేర ఖర్చును తగ్గించింది. కంపెనీ ఇటీవలే ఒక్కో షేరుకు 0.46 డాలర్ల చొప్పున నష్టపోయింది. ఆదాయంతో ఆదాయం 6.2క్షీణించి 13.28 బిలియన్‌డాలర్లు తగ్గింది. జెల్సింగర్ నిష్క్రమణ తరువాత డేవిడ్ జిన్స్నర్, మిచెల్ జాన్సన్ హోల్తాస్లు తాత్కాలికంగా సహ సీఈవోలుగా నియమితులయ్యారు. శాశ్వత సీఈవో కోసం ఇంటెల్ తీవ్రంగా అన్వేషిస్తోంది.

# ప్రత్యేక యాప్‌గా జెప్టో కేఫ్

**ముంబై, డిసెంబరు 12:** క్విక్ కామర్స్ మార్కెట్లో జెప్టో దూకుడు ప్రదర్శిస్తోంది. జెప్టో కేఫ్‌ను ప్రత్యేక యాప్‌గా అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో సహ వ్యవస్థాపకుడు ఆదిత్ పాలిచా అన్నారు. కేఫ్ సేవలకు ఆదరణ పెరుగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నెలకు 100 కుపైగా కెఫ్లను ప్రారంభిస్తున్నామని, ఇప్పటికి రోజుకు 30,000 పైచిలుకు ఆర్డర్‌లను అందుకుంటున్నామని వివరి చారు. జెప్టో వేదిక 2022 ఏప్రిల్‌లో జెప్టో కాప్ ప్రారంభం అయింది. ముంబై, ఢిల్లీ, బెంగళూరులో ఉన్న స్టోర్లలో 120 కంటే ఎక్కువ కేఫ్‌ల ద్వారా ప్రధాన నగరాల్లో తన కేఫ్ సేవను విస్తరించిన నగరాల్లో గత నెలలో కంపెనీ ప్రకటించింది. హైదరాబాద్, చెన్నై, పుణె సైతం విస్తరణ జాబితాలో ఉన్నాయని వివరించింది. వార్షిక ప్రాతిపదికన జెస్ట్ కేఫ్ వ్యాపారం ప్రస్తుతం రూ.160 కోట్ల స్థాయిలో నమోదవుతోందని. కొత్త నగరాల్లో విస్తరణ కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల సగటు రేటు సాధిస్తామని కంపెనీ దీమా వ్యక్తం చేసింది.



ఇదిలా ఉండగా సంస్థలో మరో కీలక పరిణామం జరిగింది. చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ మార్టెన్ దినేష్ గోమెజ్ తన పదవికి రాజీనామా చేశారు. కంపెనీలో చేరిన ఏడాదిలోపే ఆయన నిష్కర్షగా ఉన్నారు. జనవరిలో చీఫ్‌బ్రాండ్ ఆఫీసర్ వేదిన చెందన్ మెండింట్లో అక్టోబర్ నెలాఖరు నుండి చీఫ్ కల్చర్ ఆఫీసర్ బాధ్యలతో పాటు హోచ్ఎల్ అధిపతిగానూ కొనసాగుతున్నారని కంపెనీ ప్రకటించింది.

# వాణిజ్యం

## తగ్గిన బీమా ప్రీమియం వసూళ్లు

**ముంబై, డిసెంబరు 12:** బీమా ప్రీమియం వసూళ్లు నవంబర్ నెలలో తగ్గినట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కన్సాం చేసింది. 2023 నవంబర్‌లో వసూలై రూ.26,494 కోట్లతో ఈ ఏడాది అదేసమయంలో బీమాప్రీమియం రూ.25,306 కోట్లుగానమోదైంది. గతంలో ఇది 4.5 తక్కువగా ఉంది. బీమా రంగంలో ప్రముఖంగా సేవలందిస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐసీ) ప్రీమియం వసూళ్లు ఈసారి తగ్గుముఖం పట్టాయి. దానివల్లే ఈ పరిస్థితి నెలకొందని కౌన్సిల్ అభిప్రాయపడింది. ఎల్ఐసీ ప్రీమియం తగ్గుముఖం పడుతుంటే ప్రైవేట్ సంస్థల ప్రీమియంలో గతంలో కంటే 31 శాతం వృద్ధి కనిపించింది. నవంబర్‌లో ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ రూ.3,222 కోట్లు, మ్యాక్స్ లైఫ్ రూ.748.76 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ రూ.2,159 కోట్లు, ఎస్బీఐ లైఫ్ రూ.2,381కోట్ల వరకు ప్రీమియంవసూలు



చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి తీసుకుంటే మాత్రం జీవిత బీమా ప్రీమియం వసూళ్లలో 16 వృద్ధి కనిపించింది. ఎల్ఐసీ కూడా అదే మొత్తంలో వృద్ధి నమోదు చేసింది.జీవిత బీమా సాధనాల్లో టర్మ్ ఇన్సూరెన్స్ ఎంతో కీలకమైంది. తక్కువ ప్రీమియానికి ఎక్కువ కవరేజీనిస్తుంది.కుటుంబానికి ఆధారమైనవారు, సంపాదించే శక్తి కలిగిన వారు టర్మ్ ఇన్సూరెన్స్‌తో తమవారికి తగినంత రక్షణ కల్పించుకోవచ్చు. మనచుట్టూ ఉన్నవారిలో ఇప్పటికీ చాలా మందికి టర్మ్ బీమాప్లాన్‌లులేవు. జరగరానిది జరిగితే కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఆసరాగా ఇవ్వగలిగేది టర్మ్ ఇన్సూరెన్స్ నిపుణులు అంటున్నారు. ఇప్పటికీ దీన్ని తీసుకోని నిపుణుల సలహాతో మంచి పాలసీని ఎంచుకోవాలి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.